http://www.agnidharanews.com

# అగ్నిధార

నిజాల నిప్పు కణిక

ఆదివారం 26 ఏప్రిల్ 2026

ఎడిటర్: చేగొండ రవి కుమార్ యాదవ్

పేజీలు : 5     వెల : 5/-

Published from Peddapalli Ciculated by Hyderabad, , , Sangareddy, jagityala, Rangareddy, Khammam,Medchal Medak Siddipet, Nalgonda, , warangal, Nizamabad

## విలేకరులు కావలెను

ప్రజా గళాన్ని బలంగా వినిపిస్తూ.. అవినీతిపై సమరాన్ని సాగిస్తున్న అగ్నిధార తెలుగు దినపత్రికలో పనిచేయుటకు అనుభవం, ఆసక్తి గల వారికి అవకాశం కలదు. అన్ని జిల్లాలు, డివిజన్లు, మున్సిపల్ మరియు మండల కేంద్రాల్లో విలేకరులు కావలెను.

ఆసక్తి కలిగినవారు సంప్రదించగలరు

సెల్ : 80088 17828

# నేటి నుంచి జనగణన



"జనగణన తెలంగాణ డైరెక్టర్ భారతి హోళికెరె జనాభా లెక్కల సేకరణ వివరాలను శనివారం మీడియాకు వివరించారు. తెలంగాణ భౌగోళిక పరిధిలో ఉన్న ప్రతి ఇంటిని లెక్కిస్తామని ఆమె వెల్లడించారు. ఆసుపత్రి, బడి, గుడి, గుడిసె, అద్దె భవనం ఇలా అన్నింటి గణన జరుగుతుందని వెల్లడించారు.



- తెలంగాణలోని ప్రతీ ఇంటిని లెక్కిస్తాం
- నేటి నుంచి మే 10 వరకు సెల్ఫ్ ఎన్యుమరేషన్
- జనగణన రాష్ట్ర డైరెక్టర్ భారతి హోళికేరి ప్రకటన
- జనగణన కోసం 1855 నంబర్‌తో హెల్ప్‌లైన్
- రెండోదశలో వ్యక్తిగత సమాచారం సేకరిస్తాం
- ఆసుపత్రి, బడి, గుడి, గుడిసె అన్నీ లెక్కిస్తాం
- 2027 ఫిబ్రవరి నుంచి రెండో దశ జనగణన

హైదరాబాద్

తెలంగాణ భౌగోళిక పరిధిలో ఉన్న ప్రతి ఇంటినీ లెక్కిస్తామని జనగణన రాష్ట్ర డైరెక్టర్ భారతీ హోళికేరి తెలిపారు. జనాభా లెక్కల సేకరణ వివరాలను ఆమె మీడియా సమావేశంలో వివరించారు. ఆస్పత్రి, బడి, గుడి, గుడిసె, అద్దె భవనం ఇలా ఏదైనా జనగణన జరుగుతుందని తెలిపారు. భవనంలో ఉన్న ప్రతి కుటుంబాన్ని పరిగణనలోకి తీసుకుంటామన్న భారతీ హోళికేరి 2027 సంవత్సరం ఫిబ్రవరిలో రెండో దశ మొదలయ్యేలోగా అంతా సిద్ధం చేస్తామని స్పష్టం చేశారు. రెండో దశలో 2027 - మిగతా3లో



## అనవసరంగా లాగారు

- పుస్తక వివాదంపై నరవణె స్పందన
- రాహుల్‌పై పరోక్ష విమర్శలు
- ప్రచురణకు ముందే ఫోర్ స్టార్స్ ఆఫ్ డెస్టినీపై వివాదం
- రక్షణ మంత్రిత్వశాఖ సూచనతో పుస్తకం నిలిపివేత
- ఇది ముగిసిన అధ్యాయమంటున్న మాజీ సైన్యాధ్యక్షుడు
- రాహుల్ వ్యాఖ్యలపై పరోక్షంగా స్పందించిన నరవణె

## అజారుద్దీన్, కోదండరామ్ ఎమ్మెల్సీ అభ్యర్థిత్వాలకు లైన్‌క్లియర్

- ఫైల్‌పై ఆమోదముద్ర వేసిన గవర్నర్
- గత మూడేళ్లుగా గవర్నర్ కోటా ఎమ్మెల్సీలపై వివాదం
- ఎమ్మెల్సీ అభ్యర్థిత్వాల ఫైల్‌పై గవర్నర్ సంతకం
- గవర్నర్ కోటా ఎమ్మెల్సీలపై త్వరలో గెజిట్ నోటిఫికేషన్



హైదరాబాద్

మంత్రి అజారుద్దీన్, కోదండరామ్ ఎమ్మెల్సీ అభ్యర్థిత్వాలకు లైన్‌క్లియర్ అయింది. ఎమ్మెల్సీ అభ్యర్థిత్వాల ఫైల్‌పై గవర్నర్ సంతకం చేశారు. గవర్నర్ కోటా ఎమ్మెల్సీలపై త్వరలో గెజిట్ నోటిఫికేషన్ వెలువడనుంది. అయితే ఇప్పటికి గత మూడేళ్లుగా గవర్నర్ కోటా ఎమ్మెల్సీలపై వివాదం కొనసాగుతోంది. ఈ నెల 30లోగా ఎమ్మెల్సీ కాకపోతే అజారుద్దీన్ మంత్రి పదవి కోల్పోతారు. ఎమ్మెల్సీ అభ్యర్థిత్వాలు త్వరగా తీర్చాలని ఇటీవల సీఎం గవర్నర్‌ను కోరారు. గత సంవత్సరం అక్టోబరు 31న మంత్రిగా మహమ్మద్ అజారుద్దీన్ - మిగతా3లో


## పాక్‌లో నీటి కొరత

- సింధూ నదీజలాలపై 'దాయాది' కాళ్ల బేరానికి రానుందా?
- పహల్గాం ఉగ్రదాడి తర్వాత సింధూ జలాల ఒప్పందాన్ని నిలివేసిన భారత్
- నీటి కొరతతో భారత్‌తో చర్చలకు వచ్చే యోచనలో పాకిస్థాన్



## మోదీ, మమత ఇద్దరూ ఒక్కటే

- వారు ధనవంతులకే సాయం చేస్తారు
- దేశంలో రెండు సిద్ధాంతాల మధ్య పోరాటం జరుగుతోంది-
- కాంగ్రెస్‌కు ఐకమత్యం, సోదరభావం ఉంది
- కానీ బీజేపీకి విద్వేషం ఉంది
- మోదీ, మమతపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డ రాహుల్ గాంధీ





## మణిపూర్‌లో మళ్లీ ఉద్రిక్తత..

- సీఎం నివాసం వద్దకు ర్యాలీకి నిరసకారులు యత్నం
- ఏప్రిల్ 7న బిష్ణుపూర్ జిల్లాలో ఒక వ్యక్తి ఇంటిపై మోర్టార్ దాడి జరిగినట్లు అనుమానం
- ఇంఫాల్‌లో మణిపూర్ సమగ్రతా సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ



## ఆర్టీసీ విలీన ప్రక్రియ పూర్తి చేస్తాం

- ఆర్టీసీ విలీనం గురించి ఎన్నికల అజెండాలో పెట్టాం
- తెలంగాణ ప్రభుత్వంలో టీజీఎస్‌ఆర్టీసీ విలీనంపై మంత్రి పొన్నం ప్రభాకర్
- ఆర్టీసీ కార్మికుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నామని స్పష్టం
- కవిత రాజకీయ పార్టీపై స్పందించిన పొన్నం

హైదరాబాద్

టీజీఎస్‌ఆర్టీసీ విలీనం గురించి ఎన్నికల అజెండాలో పెట్టామన్న తెలంగాణ రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆర్థిక ఇబ్బందుల వల్ల ఇన్నాళ్లు వేచిచూడాల్సి వచ్చిందని తెలిపారు. ఆర్టీసీ కార్మికుల సమస్య పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఎప్పుడూ ప్రయత్నిస్తూనే ఉందని స్పష్టం చేశారు. ప్రేరేపితం వల్లనో మరిదేని - మిగతా3లో

## బీఆర్ఎస్ తెలంగాణ ఆత్మను కోల్పోయింది

- కవిత కొత్త పార్టీ.. 'తెలంగాణ రాష్ట్ర సేన' ఆవిర్భావం..
- కేసీఆర్‌పై తీవ్ర విమర్శలు
- తెలంగాణ రాష్ట్ర సేన (టీఆర్ఎస్) పేరుతో కొత్త పార్టీని ప్రకటించిన కవిత
- కేసీఆర్ మారిపోయారని, ఆయన మన మనిషి కాదంటూ తీవ్ర విమర్శలు
- సామాజిక తెలంగాణే లక్ష్యమని, రెండేళ్లలో అధికారంలోకి వస్తామని ధీమా
- తప్పకుండా తెలంగాణకు ముఖ్యమంత్రిని అవుతానని స్పష్టం చేసిన కవిత



హైదరాబాద్

తెలంగాణ రాజకీయాల్లో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కుమార్తె, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత కొత్త రాజకీయ పార్టీని ప్రారంభించారు. 'తెలంగాణ రాష్ట్ర సేన (టీఆర్ఎస్)' పేరుతో తన పార్టీని ప్రకటించి, రాజకీయ వర్గాల్లో సంచలనం సృష్టించారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా మునీరాబాద్‌లోని అద్వయ కన్వెన్షన్‌లో ఏర్పాటు చేసిన సభలో ఆమె పార్టీ పేరును, జెండాను ఆవిష్కరించారు. పసుపు, ఆకుపచ్చ, నీలం రంగులతో కూడిన జెండా మధ్యలో తెలంగాణ మ్యాప్, దానిపై టీఆర్ఎస్ అనే అక్షరాలు ఉన్నాయి. ఈ సందర్భంగా ఏర్పా టు చేసిన సభలో కవిత మాట్లాడుతూ... బీఆర్ఎస్ పార్టీ, దాని నాయకత్వంపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. - మిగతా3లో



## ఆప్ ప్రస్తుత దుస్థితికి పార్టీ అధిష్ఠానానిదే పూర్తి బాధ్యత

- ఆమ్ ఆద్మీ పార్టీని రాఘవ్ చద్దా సహా ఏడుగురు ఎంపీలు వీడడంపై స్పందించిన సామాజిక కార్యకర్త అన్నా హజారే
- నాయకులు పార్టీని ఎందుకు వీడుతున్నారో పార్టీ అధినాయకత్వాలు తప్పక ఆత్మపరిశీలన చేసుకోవాలని వెల్లడి

## హోంమంత్రి వ్యాఖ్యలు హింసను ప్రేరేపించేవిగా ఉన్నాయి

- హింసను ప్రేరేపించే వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోంమంత్రిపై కేసు వేస్తాం
- అలాంటి వ్యాఖ్యలతో బెంగాల్‌లో గెలువాలనుకుంటే ఎప్పటికీ గెలువలేరు
- బెంగాల్ ప్రజలు అలాంటి వ్యాఖ్యలను ఏమాత్రం అంగీకరించరు
- అసెంబ్లీ ఎన్నికల తర్వాత బెంగాల్‌లోని టీఎంసీ గూండాలను తలకిందులుగా వేలాడదీస్తాం



# ఆప్ ప్రస్తుత దుస్థితికి పార్టీ అధిష్ఠానానిదే పూర్తి బాధ్యత

ఆప్ సీనియర్ నేత రాఘవ్ చద్దా పార్టీని వీడడంపై సామాజిక కార్యకర్త అన్నా హజారే కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రజాస్వామ్యంలో రాజకీయ నిర్ణయాలు తీసుకునే హక్కు ప్రతి వ్యక్తికీ ఉంటుందని అభిప్రాయపడ్డారు. నేతలు పార్టీని ఎందుకు వీడుతున్నారో పార్టీ నాయకత్వాలు తప్పక ఆత్మపరిశీలన చేసుకోవాలని అన్నారు. ఆప్ సరైన మార్గంలో నడిచి ఉంటే ఆ పార్టీకి చెందిన రాజ్యసభ ఎంపీలు పార్టీని వీడి ఉండేవారు కాదని తెలిపారు. ఆప్ ప్రస్తుత దుస్థితికి పార్టీ అధిష్ఠానానిదే పూర్తి బాధ్యత అని పేర్కొన్నారు. మహారాష్ట్రలోని అహిల్యానగర్ జిల్లాలో విలేకరులతో మాట్లాడుతూ అన్నా హజారే ఈ వ్యాఖ్యలు చేశారు. "ప్రజాస్వామ్యంలో ప్రతి ఒక్కరికీ ఒక అభిప్రాయాన్ని కలిగి ఉండే హక్కు ఉంది. వారు (రాఘవ్ చద్దా, ఇతర ఎంపీలు) పార్టీలో ఏదో ఒక ఇబ్బందిని ఎదుర్కొని ఉంటారు. అందుకే వారు పార్టీని వీడారు. ఆప్ సరైన దిశలో పయనించి ఉంటే వారు పార్టీని వదిలిపెట్టి ఉండేవారు కాదు. ఒక పార్టీని వీడాలనే రాజకీయ నిర్ణయం వెనుక ఎప్పుడూ కొన్ని అంతర్లీన కారణాలు ఉంటాయి. వీటిని విస్తృత ప్రజాస్వామ్య కోణంలో చూడాలి. చద్దా, ఇతర ఎంపీలు ఆమ్ ఆద్మీ పార్టీని వీడటానికి ఏదో ఒక కారణం కచ్చితంగా ఉండి ఉంటుంది. ప్రజాస్వామ్యంలో ఏ పార్టీలో కొనసాగాలి? ఏ పార్టీని వీడాలి? అనే విషయంపై ప్రతి వ్యక్తికీ తన సొంత అభిప్రాయం ఉంటుంది" అని అన్నా హజారే పేర్కొన్నారు.



### ఆప్ షాకిచ్చిన చద్దా

కాగా, ఏప్రిల్ 25 (శుక్రవారం)న దిల్లీ మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ నేతృత్వంలోని ఆమ్ ఆద్మీ పార్టీకి పెద్ద ఎదురుదెబ్బ తగిలింది. పంజాబ్ రాజ్యసభ ఎంపీ రాఘవ్ చద్దా, అశోక్ మిట్టల్, సందీప్ పాఠక్ సహా ఏడుగురు ఆప్ రాజ్యసభ ఎంపీలు బీజేపీలో చేరనున్నట్లు వెల్లడించారు. కేవలం తాను మాత్రమే కాకుండా, ఆప్? రాజ్యసభ సభ్యుల్లో 2/3వ వంతు మంది ఎంపీలు కమలం పార్టీలో విలీనం కానున్నారని రాఘవ్ చద్దా ప్రకటించారు. ఈ క్రమంలో ఆప్, ఆ పార్టీ అధినాయకత్వంపై చద్దా తీవ్ర విమర్శలు చేశారు.

ఆప్‌నకు దూరమై– ప్రజలకు దగ్గరవుతున్నాను : రాఘవ్ చద్దా


ఏ ఉద్దేశాలతో ఆప్ ఏర్పడిందో వాటికి దూరంగా జరిగిందని రాఘవ్ చద్దా ఆరోపించారు. కొన్నేళ్లుగా దేశం కోసం కాకుండా వ్యక్తిగత ప్రయోజనాల కోసం పనిచేస్తోందని విమర్శించారు. తాను ఆప్ నేరాల్లో భాగం కావాలని అనుకోవడం లేదన్నారు. సరైన పార్టీలో ఉన్న భావన తనలో లేదని, అందుకే ఆప్‌నకు దూరమై, ప్రజలకు దగ్గరవుతున్నానని వెల్లడించారు. తన జీవితంలోని 15 ఏళ్లను ఆప్? కోసం ధారపోశానని తెలిపారు. కానీ ఇప్పుడు ఆ పార్టీ నిజాయితీని వదిలేసిందన్నారు.

### కేజ్రీవాల్ సన్నిహితుడిగా పేరు

కాగా, 2012లో ఆమ్? ఆద్మీ పార్టీ ఆవిర్భావం నుంచి దిల్లీ మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ వెన్నంటే రాఘవ్ చద్దా నిలిచారు. కేజ్రీవాల్‌కు అత్యంత నమ్మకస్తుడిగా ఉన్నారు. 2015లో దిల్లీ శాసనసభ ఎన్నికల్లో ఆప్? విజయం సాధించడంలో చద్దా కీలకంగా వ్యవహరించారు. అయితే, గత కొంత కాలంగా పార్టీ నాయకత్వంలో ఆయనకు విభేదాలు వచ్చాయి. దీంతో చద్దాను రాజ్యసభలో ఆప్? డిప్యూటీ లీడర్ పదవి నుంచి తీసేశారు. అంతేకాదు సభలో మాట్లాడేందుకు పార్టీ కోటా నుంచి సమయం ఇవ్వకూడదంటూ రాజ్యసభ ఛైర్మన్‌కు లేఖ రాశారు. దీంతో ఆమ్ ఆద్మీ పార్టీ, రాఘవ్ చద్దాకు ఉన్న విభేదాలు బయటపడ్డాయి. అనంతరం ఏర్పడిన పరిణామాల నేపథ్యంలో రాఘవ్ చద్దా ఆప్‌నకు గుడ్ బై చెప్పి బీజేపీ గూటికి చేరారు. అయితే ఆప్‌ను రాఘవ్ చద్దా వీడడంపై కేజ్రీవాల్ శుక్రవారం స్పందించారు. పంజాబీలకు బీజేపీ మరోసారి ద్రోహం చేసిందని మండిపడ్డారు. ఈ మేరకు ఎక్స్‌లో పోస్ట్ పెట్టారు. బీజేపీ ఆపరేషన్ లోటస్‌ను మళ్లీ మొదలుపెట్టిందని ఆప్ ఎంపీ సంజయ్ సింగ్ ఆరోపించారు. తమ ఏడుగురు ఎంపీలను ప్రలోభపెట్టడానికి ఈడీ, సీబీఐలను వాడుకుందని విమర్శించారు.

# అనవసరంగా లాగారు

భారత సైన్యం మాజీ అధిపతి జనరల్ మనోజ్ నరవణె రచించిన ఫోర్ స్టార్స్ ఆఫ్ డెస్టినీ పుస్తకంపై నెలకొన్న వివాదం మరోసారి చర్చనీయాంశమైంది. ఆ అంశంపై తాజాగా స్పందించిన నరవణ, ప్రచురణకు ముందే తన పుస్తకాన్ని వెలుగులోకి తీసుకువచ్చి అనవసరంగా వివాదంలోకి లాగారని అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీపై పరోక్షంగా విమర్శలు చేశారు. ఇటీవల ఆయన రచించిన ద క్యూరియస్ అండ్ ద క్లాసిఫైడ్: అన్ ఎర్తింగ్ మిలిటరీ మిత్స్ అండ్ మిస్టరీస్ పుస్తకం విడుదలైంది. ఈ నేపథ్యంలో ప్రముఖ ఆంగ్ల మీడియా సంస్థ ఇచ్చిన ఇంటర్వ్యూలో నరవణె పలు విషయాలను వెల్లడించారు. ఫోర్ స్టార్స్ ఆఫ్ డెస్టినీ పుస్తకం వివాదం గురించి మాట్లాడిన ఆయన, ఆ అంశం తనకు ముగిసిపోయిన అధ్యాయం అని స్పష్టం చేశారు. నరవణె మాట్లాడుతూ, "రక్షణ మంత్రిత్వశాఖ పుస్తకాన్ని పూర్తిగా పరిశీలించే వరకు ప్రచురణను నిలిపివేయాలని ప్రచురణకర్తలకు సూచించింది. ఆ నిర్ణయంతో విషయం అక్కడితో ముగిసిపోయింది. నేను కూడా ముందుకు సాగాను. అయితే ప్రచురితం కాని పుస్తకాన్ని బయటకు తీసుకువచ్చి దానిపై చర్చలు జరపడం, నన్ను కూడా అందులోకి లాగడం సమంజసం కాదు" అని పేర్కొన్నారు. ఈ పుస్తకం నేపథ్యంలో గల్వాన్ ఘర్షణల సమయంలో ప్రభుత్వ వైఖరిపై కొన్ని అంశాలు ప్రస్తావనకు రావడం అప్పట్లో పెద్ద దుమారం రేపింది. అదే సమయంలో కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ లోక్‌సభలో ఈ పుస్తకంలోని విషయాలను ప్రస్తావించేందుకు ప్రయత్నించడం కూడా రాజకీయంగా చర్చకు దారితీసింది. ప్రచురణకు రాని పుస్తకంలోని అంశాలను సభలో ప్రస్తావించడంపై అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. ఈ క్రమంలో ఆయన వ్యాఖ్యలు వివాదాస్పదంగా మారాయి.



ఇప్పుడు ఆ ఘటనను గుర్తుచేసుకుంటూ నరవణ, తనను అనవసరంగా హైలైట్ చేశారని అన్నారు.

### పుస్తకంలో జైహింద్ నినాదం మూలాలు

"ప్రచురణ కాని పుస్తకాన్ని కోట్ చేస్తూ నన్ను వెలుగులోకి తీసుకురావడం అవసరం లేదు. అది సరైన చర్య కాదు" అని ఆయన వ్యాఖ్యానించారు. ఇదిలా ఉంటే, పుస్తక రచయితగా నరవణె కొత్త దిశలో ముందుకు సాగుతున్నారు. వివాదం తర్వాత ఆయన రెండు పుస్తకాలు రచించగా, వాటిలో ఒకటి ఇప్పటికే విడుదలైంది. మరో పుస్తకం కూడా త్వరలోనే రానుందని తెలిపారు. తన తాజా పుస్తకం గంభీరమైన అకాడమిక్ గ్రంథం కాకుండా పాఠకులను ఆకట్టుకునే విధంగా ఉండేలా రాసినట్లు చెప్పారు. ద క్యూరియస్ అండ్ ద క్లాసిఫైడ్ పుస్తకంలో భారత సైన్యం, నౌకాదళం, వాయుసేనలకు సంబంధించిన ఆసక్తికర కథనాలు, అపోహలు, చారిత్రక అంశాలను వివరించారు. ముఖ్యంగా జైహింద్ నినాదం మూలాలు గురించి ఆయన ప్రస్తావించారు. ఈ నినాదం స్వాతంత్ర్య సమర కాలం నుంచి ఎలా ప్రారంభమై, తరువాత భారత సాయుధ దళాల్లో ఎలా విస్తరించిందో వివరించారు.

నరవణె తెలిపిన వివరాల ప్రకారం, ప్రారంభంలో వాయుసేనలో జైహింద్ ఉపయోగం మొదలై, తరువాత సైన్యం, నౌకాదళం కూడా దాన్ని స్వీకరించాయి. ప్రస్తుతం మూడు దళాల్లో కూడా సెల్యూట్ చేసే సమయంలో జైహింద్ అనడం ఆనవాయితీగా మారింది. ఈ నినాదానికి ఉన్న చారిత్రక నేపథ్యం ఎంతో లోతైనదని ఆయన పేర్కొన్నారు. అదే విధంగా అసోం రెజిమెంట్‌కు చెందిన సైనికుడు బద్లురామ్ కథను కూడా ఆయన పుస్తకంలో ప్రస్తావించారు. 1944లో కోహిమా యుద్ధంలో బద్లురామ్ మరణించినప్పటికీ, అతనికి కేటాయించిన రేషన్ కొనసాగుతుండటం వల్ల ఆ యూనిట్‌కు ఆహారం అందుతూ ఉండేదని తెలిపారు. ఈ సంఘటన ఆధారంగా రూపొందిన బద్లురామ్ కా బదన్ అనే పాట ఆ రెజిమెంట్‌లో ఇప్పటికీ ప్రముఖంగా వినిపిస్తుందని చెప్పారు.

ఇక 1971 యుద్ధ సమయంలో పాకిస్థాన్? చేతికి చిక్కిన పెడోంగి అనే గాడిద కథను కూడా నరవణె వివరించారు. ఆ గాడిద శత్రువుల నుంచి తప్పించుకుని, మైన్స్ మధ్యగా ప్రయాణించి తిరిగి తన యూనిట్‌కు చేరుకుందని చెప్పారు. దాని విశ్వాసం, ధైర్యానికి గుర్తింపుగా గౌరవప్రదంగా రిటైర్మెంట్ ఇచ్చినట్లు తెలిపారు. మొత్తానికి ఫోర్ స్టార్స్ ఆఫ్ డెస్టినీ పుస్తకం చుట్టూ నెలకొన్న వివాదం తనకు ముగిసిన అంశమని నరవణె స్పష్టం చేశారు. అయితే ప్రచురణకు ముందే దానిని రాజకీయ చర్చల్లోకి లాగడం తగదని అభిప్రాయపడ్డారు. ప్రస్తుతం రచయితగా తన ప్రయాణాన్ని కొనసాగిస్తూ, కొత్త విషయాలను పాఠకులకు అందించడంపై దృష్టి పెట్టినట్లు తెలిపారు.

# పాక్‌లో నీటి కొరత

పాకిస్థాన్ ప్రస్తుతం తీవ్ర నీటి ఎద్దడితో అల్లాడుతోంది. ఆ దేశ వ్యవసాయ రంగం కుదేలయ్యే ప్రమాదం పొంచి ఉంది. ఈ దుస్థితిలో భారత్‌తో కాళ్ల బేరానికి పాక్ వచ్చే అవకాశాలు ఉన్నాయని అంతర్జాతీయ వ్యవహారాల పరిశీలకులు అంచనా వేస్తున్నారు. 2025లో పహల్గాం ఉగ్రదాడి అనంతరం సింధూ నదీజలాల ఒప్పందం అమలును భారత్ ఆపేసింది. ఆ ఒప్పందాన్ని పునరుద్ధరించే మాటనే భారత్ ఎత్తడం లేదు. నీటి ఎద్దడి నేపథ్యంలో పాక్ మొండివైఖరిని వీడి భారత్‌తో చర్చలకు వచ్చే సూచనలు ఉన్నాయని మాజీ బ్యూరోక్రాట్ కేబీఎస్ సింధు అంటున్నారు. ఈసారి పాక్ చర్చలకు వచ్చినప్పుడు, భారత్‌తో సరి సమాన భాగస్వామిగా కాకుండా నీటి సంక్షోభంలో ఉన్న దేశంగా వస్తుందని ఆయన తెలిపారు. ఈ నేపథ్యంలో పాక్‌తో కుదిరే ఏ ఒప్పందమైనా ఉగ్రవాదానికి వ్యతిరేకంగా ధ్రువీకరించదగిన చర్యలతో ముడిపడి ఉండాలని సూచించారు. 2025 సంవత్సరంలో పహల్గామ్ ఉగ్రదాడి అనంతరం సింధూ నదీజలాల ఒప్పందం అమలును భారత్ తాత్కాలికంగా నిలిపివేసింది. ఉగ్రవాదులను పెంచి పోషిస్తున్న పాకిస్థాన్‌పై ఆనాడు భారత్ తీసుకున్న ఈ చర్యపై మళ్లీ చర్చ మొదలైంది. జల భద్రత, సార్వభౌమాధికారం, దీర్ఘకాలిక వ్యూహాత్మక ప్రణాళిక అనే కీలకమైన కోణాల్లో దీనిపై ఇప్పుడు డిస్కషన్ జరుగుతోంది. పాక్‌పై తీసుకున్న ఈ చర్యను ఒక శాశ్వత జలసంబంధ, భౌగోళిక రాజకీయ ప్రయోజనంగా భారత్ మార్చుకోవాలని అంతర్జాతీయ వ్యవహారాల పరిశీలకులు సూచిస్తున్నారు.

### అది అవివేకమైన ఉదారతా చర్య

1960లో భారత్– పాక్ మధ్య కుదిరిన సింధూ నదీజలాల ఒప్పందాన్ని ఒక అసాధారణమైన, అవివేకమైన ఉదారతా చర్యగా మాజీ బ్యూరోక్రాట్ కేబీఎస్ సింధు అభివర్ణించారు. సద్భావనతో మెలుగుతుందనే అంచనాలతో ఆనాడు సింధూ నదీజలాల్లో మెజారిటీ వాటాను పాకిస్థాన్‌కు భారత్ వదులుకుందని ఆయన తెలిపారు. నాగరిక, అంతర్రాష్ట్ర సంబంధాల నిబంధనలకు పాక్ కట్టుబడి ఉంటుందా ఉండదా అనే దానిపై ఈ ఒప్పందం మనుగడ ఆధారపడి ఉందన్నారు. అయితే ఈ ఒప్పందం యథాతథంగా మాత్రం కొనసాగలేదని కేబీఎస్ సింధు అభిప్రాయపడ్డారు.

### నదీజలాల పంపిణీలో అసమతుల్యత దిగ్భ్రాంతికరం

"సింధూ నదీజలాల ఒప్పందం ఫలితంగా ఈ బేసిన్ పరిధిలోని మొత్తం నీటి ప్రవాహంలో దాదాపు 80 శాతం పాక్‌కు లభించింది. ఆనాడు ఇంత అసమతుల్యంగా నదీజలాల పంపిణీ జరగడం దిగ్భ్రాంతి కలిగించే అంశం. సింధూ నదికి ఎగువన ఉన్న దేశం అయినప్పటికీ భారతదేశం స్వచ్ఛందంగా తనను తాను తక్కువ నీటి వాటాకు పరిమితం చేసుకుంది. ఫలితంగా దిగువన ఉన్న పాకిస్థాన్ ఈ నదీజలాల కేటాయింపుతో ప్రయోజనాన్ని పొందింది. సింధూ నదీజలాల ఒప్పందం అమలును నిలిపివేసే చర్యను ఎన్నడో తీసుకొని ఉండాల్సింది. కానీ ఎట్టకేలకు 2025లో తీసుకున్నారు. ఈ చర్య చట్టపరంగానూ సమర్థనీయమైందే. ఎందుకంటే పాకిస్థాన్ చాలా దశాబ్దాలుగా సీమాంతర ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తూ అంతర్జాతీయ చట్టాలను అపహాస్యం చేస్తోంది. ఉగ్రవాదులను ఎగుమతి చేసే పనిని చేస్తున్న పాకిస్థాన్‌కు భారత్ తగిన శాస్తి చేసింది. పాక్ వ్యవసాయ ఆర్థిక వ్యవస్థకు దన్నుగా నిలుస్తున్న సింధూ నదీజలాల ఒప్పందాన్ని భారత్ నిలుపుదల చేయడం సరైన చర్యే. ఆ ఒప్పందాన్ని కొనసాగించాల్సిన అవసరం భారత్‌కు చట్టపరంగా కానీ, మనస్సాక్షి పరంగా కానీ లేనే లేదు" అని సేవియర్స్ మ్యాగజైన్‌లో రాసిన విశ్లేషణలో కేబీఎస్ సింధు ప్రస్తావించారు.

### నీటి హక్కుల వినియోగంలో భారత్ వెనుకంజ

"దేశ సరిహద్దు ప్రాంతాల్లో భారత్ తన నీటి హక్కులను సక్రమంగా వినియోగించుకోవడం లేదు. రంజిత్ సాగర్ డ్యామ్, షాహ్‌పుర్ కండి డ్యామ్ వంటి ప్రాజెక్టుల నిర్మాణ పనులు దశాబ్దాల తరబడి ఆలస్యమయ్యాయి. దీంతో గణనీయమైన పరిమాణంలో నదుల నీరు పాక్‌లోకి ప్రవహించింది. ఓ వైపు భారత్‌లోని పంజాబ్‌లో భూగర్భ జలమట్టాలు తగ్గుతున్నాయి. మరోవైపు సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణ పనుల్లో జాప్యం వల్ల ప్రతి ఏడాది భారతదేశానికి చెందిన రావి నది జలాల్లో దాదాపు 26.136 టీఎంసీల నీరు పాక్‌లోకి చేరుతోంది. సింధూ నదీజలాల ఒప్పందం ప్రకారం పరిమిత నిల్వ, జలవిద్యుత్ అభివృద్ధికి మాత్రమే అనుమతి ఉన్న పశ్చిమ నదుల విషయంలోనూ భారతదేశం వెనుకబడింది. 156.82 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యంతో ప్రాజెక్టులను నిర్మించుకోవడానికి మన దేశానికి అనుమతి ఉంది. అయినప్పటికీ చాలా తక్కువ మోతాదులోనే నదుల నీటిని మనం నిల్వ చేసుకోగలుగుతున్నాం. ఇక 18 గిగావాట్లకుపైగా ఉన్న జలవిద్యుత్ సామర్థ్యాన్ని సైతాన్ని భారత్ అందిపుచ్చుకో లేకపోతోంది" అని కేబీఎస్ సింధు పేర్కొన్నారు.

### పంజాబ్‌లో జల సంక్షోభం

"భారత్‌లోని కిషన్‌గంగా, రాటిల్ జలవిద్యుత్ ప్రాజెక్టుల నిర్మాణాలపై పాకిస్థాన్ రాద్ధాంతం చేస్తోంది. అవి సింధూ నదీ జలాల ఒప్పందానికి అనుగుణంగా లేవని వాదిస్తోంది. ఈ అభ్యంతరాలు, మధ్యవర్తిత్వ విచారణల వల్ల భారత్ చేపట్టిన పలు మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల పనుల్లో జాప్యం జరుగుతోంది. అంతర్జాతీయ నిబంధనలు అనేవి జాతీయ ప్రయోజనాల ప్రాతిపదికనే రూపుదిద్దుకుంటాయి. ఈ లెక్కన భారత్ చర్యలు సరైనవే. ప్రపంచ దేశాలు తమ సార్వభౌమ మనుగడ కోసం, జాతీయ ప్రయోజనాల కోసం ఒప్పందాలను పక్కన పెట్టొచ్చు. ప్రస్తుతం పంజాబ్‌లో భూగర్భ జల మట్టాలు తగ్గుతున్నాయి. ఇది భారత వ్యవసాయ రంగానికి, జాతీయ భద్రతకు సవాలు లాంటి అంశం. దీనివల్ల సామాజిక అస్థిరత, ఆర్థిక అవాంతరాలు ఏర్పడొచ్చు. ఈ సమస్య పరిష్కారం కోసం పశ్చిమ నదుల నుంచి ఉత్తర భారత రాష్ట్రాలకు నీటిని మళ్లించేందుకు భారీ మౌలిక సదుపాయాల ప్రాజెక్టులను చేపట్టొచ్చు. మార్హు టన్నెల్ మీదుగా చీనాబ్–రావి డైవర్షన్ జల ప్రాజెక్టును నిర్మించొచ్చు. దీనివల్ల ఉత్తరాది రాష్ట్రాలకు జలభద్రత లభిస్తుంది. బుర్సార్, సవాల్‌కోట్ వంటి ప్రధాన జలాశయ ఆనకట్టలను నిర్మించాలి. జీలం, బియాస్ నదులను కలిపే అంతర్–బేసిన్ బదిలీ వ్యవస్థల నిర్మాణాన్ని వేగవంతం చేయాలి. ఈ ప్రాజెక్టులను పూర్తిగా కేంద్ర ప్రభుత్వ నిధులతో నిర్మించాలి. వీటిని జాతీయ భద్రతా ప్రాధాన్యతలుగా పరిగణించి వేగవంతమైన అనుమతులను మంజూరు చేయాలి" అని కేబీఎస్ సింధు ప్రతిపాదించారు.

## మోదీ, మమత ఇద్దరూ ఒక్కటే

దేశంలో రెండు సిద్ధాంతాల మధ్య పోరాటం జరుగుతోందని లోక్‌సభలో విపక్ష నేత రాహుల్‌గాంధీ వ్యాఖ్యానించారు. ఒకవైపు కాంగ్రెస్ ఐకమత్యం, సోదరభావం ఉంటే, మరోవైపు బీజేపీ విద్వేషం ఉందన్నారు. బంగాల్‌లోని హుగ్లీ జిల్లాలో రాహుల్‌గాంధీ రెండోవిడత ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాని నరేంద్రమోదీ, బంగాల్ సీఎం మమతాబెనర్జీపై తీవ్ర ఆరోపణలు చేశారు. మోదీ, మమత ఇద్దరూ ఒకటేనని, వారు ధనవంతులకే సాయం చేస్తున్నారని రాహుల్ విమర్శించారు. వారికి అధికారమే ముఖ్యమని, పేదల కోసం పనిచేయడం కాదని ఆరోపించారు. ఇద్దరూ అధికారం కోసం ఆరాటపడుతూ దేశ సంపదను ధనికులకు దోచిపెడుతున్నారని ఆయన ఆరోపించారు. తన చర్యలతో మమతాబెనర్జి బెంగాల్‌ను నాశనం చేస్తే.. మోదీ దేశాన్ని నాశనం చేస్తున్నారని విమర్శించారు. ప్రస్తుతం జరుగుతున్నది ఎన్నికల పోరాటం కాదని, సిద్ధాంతాల పోరాటమని అన్నారు. ఒకవైపు కాంగ్రెస్ ఐక్యత, సౌభ్రాతృత్వం.. మరోవైపు బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్‌ల ద్వేషం, హింస మధ్య పోరాటం జరుగుతోందని న్నారు. హుగ్లీ జిల్లాలో జరిగిన ఎన్నికల ర్యాలీలో మాట్లాడుతూ రాహుల్‌గాంధీ ఈ వ్యాఖ్యలు చేశారు. దేశ భక్తుడిని అని చెప్పుకుంటూ ప్రధాని మోదీ దేశాన్ని అమ్ముకుంటున్నారని రాహుల్‌గాంధీ మండిపడ్డారు. ఆయన ఎక్కడికి వెళ్లినా ప్రజల్లో ద్వేషాన్ని, భయాన్ని వ్యాపింపజేస్తారన్నారు. ఆర్‌ఎస్‌ఎస్ సిద్ధాంతాలకు అన్ని రాష్ట్రాలు లోబడి ఉండాలని బీజేపీ ప్రయత్నిస్తోందన్నారు. ఆ పార్టీ పేదల గురించి ఎప్పుడూ ఆలోచించలేదని, ధనికుల లబ్ధి కోసమే పని చేస్తుందని అన్నారు. కాంగ్రెస్ హయాంలో సామాన్యుల పురోభివృద్ధి కోసం తీసుకొచ్చిన మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని పేరు మార్చి అస్తవ్యస్తం చేస్తోందని అన్నారు.

## మణిపూర్‌లో మళ్లీ ఉద్రిక్తత



ఇంఫాల్: మణిపూర్‌లో మళ్లీ ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. సీఎం నివాసం వద్దకు ర్యాలీ గా వెళ్లేందుకు నిరసకారులు ప్రయత్నించారు. ఈ నేపథ్యంలో పోలీసులతో ఘర్షణ జరుగడంతో బాష్పవాయు ప్రయోగించారు. ఏప్రిల్ 7న బిష్ణుపూర్ జిల్లాలో ఒక వ్యక్తి ఇంటిపై మోర్టార్ దాడి జరిగినట్లు అనుమానిస్తున్నారు. ఈ దాడిలో ఇద్దరు చిన్న పిల్లలు మరణించగా, వారి తల్లి తీవ్రంగా గాయపడింది. దీంతో మణిపూర్‌లో మళ్లీ ఉద్రిక్తతలు తలెత్తాయి. కాగా, శనివారం ఇంఫాల్‌లో మణిపూర్ సమగ్రతా సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఆరు కీలక డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని సమర్పించడానికి సీఎం యుమ్నం ఖేమ్‌చంద్ సింగ్ నివాసం వద్దకు చేరుకున్నారు. ఈ సందర్భంగా నిరసనకారులు, భద్రతా దళాల మధ్య ఘర్షణలు చెలరేగాయి. దీంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. ఈ నేపథ్యంలో నిరసనకారులను చెదరగొట్టడానికి భద్రతా దళాలు బాష్పవాయువును ప్రయోగించారు. గాయపడిన వారిని హాస్పిటల్‌కు తరలించారు.

## హోంమంత్రి వ్యాఖ్యలు హింసను ప్రేరేపించేవిగా ఉన్నాయి



పశ్చిమబెంగాల్‌లో హింసను ప్రేరేపించే వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోంమంత్రి అమిత్ షాపై తాము చట్టపరమైన చర్యలు తీసుకోబోతున్నామని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి మమతాబెనర్జి అన్నారు. కేంద్ర హోంమంత్రి హోదాలో ఉన్న వ్యక్తి అలాంటి వ్యాఖ్యలు చేయడం కరెక్ట్ కాదని ఆమె అన్నారు. హోంమంత్రి వ్యాఖ్యలు హింసను ప్రేరేపించేవిగా ఉన్నాయని విమర్శించారు. అలాంటి వ్యాఖ్యలతో బెంగాల్‌లో గెలువాలనుకుంటే ఎప్పటికీ గెలువలేరని స్పష్టంచేశారు. బెంగాల్ ప్రజలు అలాంటి వ్యాఖ్యలను ఏమాత్రం అంగీకరించరని చెప్పారు. హుగ్లీలో జరిగిన ఎన్నికల ప్రచారసభలో మమతాబెనర్జి ప్రసంగించారు. ఈ సందర్భంగా శుక్రవారం కేంద్రహోంమంత్రి చేసిన వ్యాఖ్యలపై ఆమె మండిపడ్డారు. శుక్రవారం ఎన్నికల ప్రచార సభలో కేంద్ర హోంమంత్రి మాట్లాడుతూ.. అసెంబ్లీ ఎన్నికల తర్వాత బెంగాల్‌లోని టీఎంసీ గూండాలను తలకిందులుగా వేలాడదీస్తామని వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలను మమత తీవ్రంగా తప్పుపట్టారు. ఆయనపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కాగా పశ్చిమ బెంగాల్‌లోని మొత్తం 294 అసెంబ్లీ స్థానాలకు రెండు విడతల్లో ఎన్నికలు నిర్వహిస్తున్నారు. ఏప్రిల్ 23న తొలి విడత ఎన్నికల పోలింగ్ పూర్తయ్యింది. ఏప్రిల్ 29న రెండో విడత పోలింగ్ జరుగనుంది. మే 4న ఓట్లను లెక్కించి ఫలితాలను వెల్లడించనున్నారు. బెంగాల్‌లో అధికార తృణమూల్ కాంగ్రెస్, ప్రతిపక్ష బీజేపీ మధ్యనే ప్రధాన పోటీ నెలకొంది. గతంలో దశాబ్దాల తరబడి బెంగాల్‌ను ఏలిన వామపక్షాలు ఇప్పుడు నామమాత్ర పార్టీలుగా మారిపోయాయి.

## రూమ్‌కు ఫియాన్సీ వస్తోందని.. ఆ డ్రగ్స్ తీసుకున్నాడు.. కానీ ఓవర్‌డోస్‌తో మృతి

**న్యూఢిల్లీ:** లైంగిక సామర్థ్యాన్ని పెంచే డ్రగ్స్ తీసుకుని.. గురుగ్రామ్‌లోని తన ఫ్లాట్‌లో 29 ఏళ్ల వ్యక్తి మృతిచెందినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. సెక్టార్ 53లో ఉన్న పీజీ ఫ్లాట్‌లో అతని మృతదేహాన్ని గుర్తించారు. లైంగిక సామర్థ్యాన్ని రెట్టింపు చేసే కొన్ని మందులను రూమ్‌లో గుర్తించినట్లు పోలీసులు వెల్లడించారు. పోలీసుల వివరాల ప్రకారం.. బాధిత వ్యక్తిని రోహిత్ లాల్‌గా గుర్తించారు. అతని స్వస్థలం నాగపూర్. క్వాలిటీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఆఫీసులో అతను పనిచేస్తున్నాడు. గురుగ్రామ్‌లోని ఓ రెంట్ ఇంట్లో ఉంటున్నాడు. పోస్టుమార్టమ్ నిర్వహించిన తర్వాత అతని మృతదేహాన్ని ఫ్యామిలీకి అప్పగించారు. అయితే గురువారం ఉదయం లాల్‌తో పనిచేసే వ్యక్తి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో విషయం వెలుగులోకి వచ్చింది. సహచర ఉద్యోగి ప్రకారం.. ఇద్దరూ ప్రతి రోజు కలిసి ఉద్యోగానికి వెళ్తుంటారు. కానీ ఘటన జరిగిన రోజు లాల్ ఫోన్ ఎత్తలేదు. అతని రూమ్‌డోర్ కూడా ఓపెన్ చేయలేదని చెప్పాడు. పోలీసులకు ఫిర్యాదు చేయడంతో.. వాళ్లు ఆ డోరు తీశారు. బెడ్‌పై లాల్ మృతదేహాన్ని గుర్తించారు. రూమ్ నుంచి మెడిసిన్స్, హెల్త్ సప్లిమెంట్లను కూడా రికవరీ చేశారు. తన కాబోయే భార్యను రూమ్‌కు ఇన్వైట్ చేశారని, కానీ ఫియాన్సీ వచ్చేలోపే అతను చనిపోయినట్లు సీనియర్ పోలీసు అధికారి తెలిపారు.

# బీఆర్ఎస్ తెలంగాణ ఆత్మను కోల్పోయింది

-మొదటిపేజీ తరువాయి

బీఆర్ఎస్ పార్టీ తెలంగాణ ఆత్మను పూర్తిగా కోల్పోవడం వల్లే తాను కొత్త పార్టీ పెట్టాల్సి వచ్చిందని స్పష్టం చేశారు. ఉద్యమ నాయకుడైన కేసీఆర్ అభివృద్ధి రథం గాడి తప్పిందని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో జరిగిన కొన్ని తప్పుల్లో భాగస్వామినేనని అంగీకరిస్తూ, ఇప్పుడు ఆ తప్పులను సరిదిద్దుకునే ప్రయత్నం చేస్తున్నానని తెలిపారు.

"ప్రస్తుతం ఉన్న కేసీఆర్ ఒకప్పటి కేసీఆర్ కాదు. ఆయన 'మర మనిషి'గా మారిపోయారు, మన మనిషి కాదు. ఆయన గుంట నక్కల చేతిలో ఖైదీగా మారారు" అంటూ కవిత తన తండ్రిపై సంచలన ఆరోపణలు చేశారు. రాష్ట్రంలో ప్రజలు కష్టాల్లో ఉంటే కేసీఆర్ పట్టించుకోవడం లేదని, అధికారం ముందు మమకారం తగ్గిపోయిందని విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతి జరిగిందని తాను హెచ్చరించినా, తనను పక్కనపెట్టి 'పందికొక్కులను' అందలం ఎక్కించారని మండిపడ్డారు. తనను పార్టీ నుంచి సస్పెండ్ చేసి మంచి పని చేశారని, ఇప్పుడు తన రాష్ట్రం కోసం స్వేచ్ఛగా పోరాడతానని అన్నారు.

సామాజిక తెలంగాణ సాధనే తమ పార్టీ లక్ష్యమని కవిత ప్రకటించారు. రాష్ట్రంలోని మూడున్నర కోట్ల మందికి 'అమ్మ'గా మారి సేవ చేయాలని ఆకాంక్షిస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం తాము ప్రతిపక్ష పాత్ర పోషిస్తామని, రెండేళ్లలో కచ్చితంగా అధికారంలోకి వస్తామని ధీమా వ్యక్తం చేశారు. తాను తెలంగాణకు ముఖ్యమంత్రిని అవుతానని స్పష్టం చేశారు. పార్టీ ప్రకటనకు ముందు కవిత తన బంజారాహిల్స్ నివాసంలో సర్వమత ప్రార్థనలు చేసి, గన్ పార్కులోని అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పించారు.

**కేసీఆర్ ఒక మర మనిషి అంటూ ఘాటు వ్యాఖ్యలు**

తెలంగాణ రాజకీయ యవనికపై ఒక భారీ విస్ఫోటనం సంభవించింది. బీఆర్ఎస్ పార్టీకి కొంత కాలం క్రితం రాజీనామా చేసిన కల్వకుంట్ల కవిత, తెలంగాణ రాజకీయాల్లో తన ప్రయాణాన్ని అధికారికంగా ప్రారంభించారు. తన తండ్రి కేసీఆర్ పైనే తిరుగుబాటు జెండా ఎగురవేసి సరికొత్త అధ్యాయానికి శ్రీకారం చుట్టారు. మేడ్చల్ జిల్లా మునీరాబాద్ వేదికగా జనసముద్రం సాక్షిగా ఆమె తన కొత్త పార్టీ 'తెలంగాణ రాష్ట్ర సేన' (౨=ూ) పేరును ప్రకటించి, రాజకీయ వర్గాలను ఆశ్చర్యంలో ముంచెత్తారు. ఈ బహిరంగ సభలో బీఆర్ఎస్ ను కవిత పూర్తిగా టార్గెట్ చేశారు. కేసీఆర్ నేతృత్వంలోని ఉద్యమ రథం దారితప్పిందని, సామాజిక తెలంగాణ రథచక్రం ఎక్కడో విరిగి ముక్కలైందని ఆమె ఆరోపించారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం వచ్చి 12 ఏళ్లయినా ప్రజల ఆకాంక్షలు నెరవేరలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తన తండ్రి కేసీఆర్ ను ఉద్దేశించి కవిత ఘాటు వ్యాఖ్యలు చేశారు.. "కేసీఆర్ గారు ఇప్పుడు మన మనిషి కాదు.. ఆయనో మరమనిషి. ప్రజలకు ఏ కష్టమొచ్చినా ఆయన బయటకు రారు. తెలంగాణ ఆత్మను బీఆర్ఎస్ పూర్తిగా కోల్పోయింది" అని కవిత అన్నారు. ప్రజలకు ఏ చిన్ని కష్టం వచ్చినా ఆనాటి




కేసీఆర్ బయటకు వచ్చేవారని... ఈనాటి కేసీఆర్ ప్రజల కష్టాలను పట్టించుకోవడం లేదని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. గతంలో చేనేత కార్మికులు ఎన్నో సమస్యలను ఎదుర్కొంటున్న సమయంలో వారి కోసం కేసీఆర్ జోలె పట్టిన సందర్భాన్ని కవిత ఈ సందర్భంగా గుర్తు చేశారు. కేసీఆర్ లో మార్పు వస్తుందేమోనని తాను చాలా కాలంగా ఎదురు చూశానని... ఆయనలో మార్పు రాకపోగా, తననే పార్టీ నుంచి సస్పెండ్ చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ ఆత్మను కాపాడేందుకే తాను కొత్త పార్టీ పెట్టానని చెప్పారు.

**'పాంచజన్యం' శంఖం పూరించిన కవిత**

1. ఉచిత విద్య :
రూపాయి భారం పడకుండా ఎంతవరకైనా ఉచిత విద్య బాధ్యత తీసుకుంటాం
2. ఉచిత వైద్యం :
ఏ వ్యాధి వచ్చినా ఒక్క రూపాయి ఖర్చు కాకుండా ప్రభుత్వం బాధ్యత తీసుకుంటుంది
3. రైతే రాజు :
రైతే రాజు నినాదంతో ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో ప్రత్యేక అధికారి సేవలు
4. ఉపాధి :
యువతకు బ్యాంకులతో సంబంధం లేకుండా రూ.20 కోట్ల వరకు ఆర్థిక సాయం
యూత్ ఎంపవర్‌మెంట్ గ్రూపుల ఏర్పాటు
ప్రభుత్వం వచ్చాక తొలి ఏడాది ఒకేసారి 4 లక్షల ఉద్యోగాల భర్తీ
2014 జూన్ 2 కటాఫ్‌తో ఉద్యమకారులకు లక్ష ఉద్యోగాలు
ఉద్యమకారులకు సూపర్ న్యూమరరీ పోస్టులు
5. సామాజిక తెలంగాణ :
బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, మహిళలకు న్యాయం
బీసీలకు 50 శాతం రిజర్వేషన్ల కోసం పోరాటం

ఉద్యమం నుంచి సస్పెండ్ వరకు

తెలంగాణ ఉద్యమంలో క్రియాశీలకంగా పని చేసిన కవిత, తెలంగాణ జాగృతి పేరిట వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. 2014లో నిజామాబాద్ నుంచి టీఆర్ఎస్ తరఫున లోక్‌సభకు ఎన్నికైన ఆమె, 2018లో ఓటమి పాలయ్యారు. అనంతరం రెండు దఫాలు నిజామాబాద్ స్థానిక సంస్థల కోటా నుంచి ఎమ్మెల్సీగా ఎన్నికయ్యారు. ఢిల్లీ మద్యం కేసులో అరెస్ట్, బెయిల్ తదనంతర పరిణామాల నేపథ్యంలో బీఆర్ఎస్ పార్టీ నేతలు, విధానాలతో కవిత విభేదిస్తూ వస్తున్నారు. నేతలు, పార్టీపై బహిరంగ విమర్శలు చేయడంతో 2025 సెప్టెంబర్ 2న ఆమెను పార్టీ సస్పెండ్ చేసింది. ఆ మరుసటి రోజే బీఆర్ఎస్ పార్టీకి, శాసనమండలి సభ్యత్వానికి రాజీనామా చేశారు.

అన్ని వర్గాల కోసం పని చేస్తాం

జాగృతి జనం బాట పేరిట క్షేత్రస్థాయిలో పర్యటించిన కవిత, కొత్త రాజకీయ పార్టీ ఏర్పాటు చేస్తామని మార్చి 27న శ్రీరామనవమి సందర్భంగా అధికారిక ప్రకటన చేశారు. సర్వోదయ, సామాజిక తెలంగాణ లక్ష్యంగా రాజకీయ పార్టీ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రం ఏర్పాటైన తర్వాత అందరికీ ఫలాలు అందట్లేదని, ప్రజల ఆశయాలు నెరవేరడం లేదంటున్న కవిత, అన్ని వర్గాల కోసం పని చేస్తామని చెప్పారు. అమరవీరుల ఆశయాల సాధన కోసం పని చేస్తామని, ఉద్యమకారులను కలుపుకొని పోతామని కవిత చెప్పారు. వివిధ ప్రజా సంఘాలు, కార్మిక సంఘాలు, భావ సారూప్యత కలిగిన రాజకీయ పార్టీలతో కలిసి పని చేస్తామని వెల్లడించారు.

# నేటి నుంచి జనగణన

-మొదటిపేజీ తరువాయి

సంవత్సరం ఫిబ్రవరి నుంచి వ్యక్తిగత సమాచారం సేకరిస్తామని అన్నారు. ఇళ్ల గణన కోసం బ్లాకులుగా విభజించి ఎన్యుమరేటర్లను కేటాయిస్తామని, వచ్చే నెల 11 నుంచి జూన్ 9 వరకు ఎన్యుమరేటర్లు ప్రతి ఇంటికి మార్కు చేస్తారని, ప్రతి భవనంలో ఎన్ని ఇళ్లు ఉన్నాయనేది మార్కు చేస్తారని పేర్కొన్నారు.

**నివాసాల మార్కింగ్ పూర్తి అవుతుంది**

నేటి నుంచి మే 10 వరకు తెలంగాణలో సెల్ఫ్ ఎన్యుమరేషన్ ఉంటుందన్న భారతి హోళికేరి సెల్ఫ్ ఎన్యుమరేషన్ కోసం ప్రత్యేక పోర్టల్ ఏర్పాటు చేశామని తెలిపారు. ౦వ.ఎవఅంబం.ప్రశీజ.అఅ పోర్టల్‌లో సెల్ఫ్ ఎన్యుమరేషన్‌కు వీలు కల్పించామని, 15 రోజులపాటు సెల్ఫ్ ఎన్యుమరేషన్ కార్యక్రమం ఉంటుందన్నారు. మొదటిసారి డిజిటల్ రూపంలో జనాభా లెక్కల సేకరణ చేస్తున్నామని, ప్రజలు స్వతహాగా వివరాలు నమోదు చేసుకోవచ్చని తెలిపారు. సెల్ఫ్ ఎన్యుమరేషన్ 16 భాషల్లో అందుబాటులో ఉంటుందని, సమాచార భద్రతపై ఎలాంటి భయాందోళన చెందవద్దని సూచించారు. జనగణనతో పాటే కులగణన ఉంటుందని, తొలివిడతలో ఇళ్లకు సంబంధించిన వివరాల నమోదు ఉంటుందని, మే 11 నుంచి జూన్ 19 వరకు నివాసాలపై మార్కింగ్ చేస్తామని, మూడు, నాలుగు రోజుల్లో నివాసాల మార్కింగ్ పూర్తి అవుతుందని వివరించారు.

**ఎక్కడ ఉన్నా సెల్ఫ్ ఎన్యుమరేషన్ చేసుకోవచ్చు**

తొలి విడత గణన, స్వీయ ధ్రువీకరణ వివరాలు వెల్లడించిన భారతి హోళికేరి సెల్ఫ్ ఎన్యుమరేషన్‌లో 33 ప్రశ్నలు ఉంటాయని తెలిపారు. సెల్ఫ్ ఎన్యుమరేషన్ తర్వాత రెండో దశలో ఎన్యుమరేటర్ ప్రతి ఇంటికీ వస్తారని అన్నారు. 33 ప్రశ్నల్లో 27 ప్రశ్నలకే ప్రజలు జవాబు ఇవ్వాల్సి ఉంటుందని, భారతి హోళికేరి మిగతా 6 ప్రశ్నలకు ఎన్యుమరేటర్ ఇంటికి వస్తే వివరాలు చెప్పాలని సూచించారు. సెల్ఫ్ ఎన్యుమరేషన్ తప్పనిసరి కాదని, ఆప్షన్ మాత్రమేనని అన్నారు. దేశంలో ఎక్కడ ఉన్నా సెల్ఫ్ ఎన్యుమరేషన్ చేసుకోవచ్చని తెలిపారు.

**తొలి విడత ఇళ్ల గణన ఉంటుంది**

జనగణన కోసం 1855 నంబర్‌తో హెల్ప్‌లైన్ ఏర్పాటు చేశామని, ఉదయం 10 నుంచి సాయంత్రం 6 వరకు హెల్ప్‌లైన్ సేవలు అందుబాటులో ఉంటాయని అన్నారు. తొలి విడతలో సెల్ఫ్ ఎన్యుమరేషన్ ద్వారా జనాభా లెక్కల సేకరణ చేస్తామని, జీహెచ్ఎంసీ కోర్ అర్బన్ పరిధిలోని వార్డుల్లో వివరాల సేకరణ చేస్తామని, జీహెచ్ఎంసీలోని 61 సర్కిళ్లలో ఛార్జ్ ఆఫీసర్లు పర్యవేక్షిస్తారని తెలిపారు. వచ్చే నెల 11 నుంచి జూన్ 19 వరకు తొలి విడత ఇళ్ల గణన ఉంటుందని వివరించారు. "రేపటి నుంచి మే 10 వరకు తెలంగాణలో సెల్ఫ్ ఎన్యుమరేషన్ చేసుకోవచ్చు. సెల్ఫ్ ఎన్యుమరేషన్ కోసం ప్రత్యేక పోర్టల్ ఏర్పాటు చేశాం. ౦వ.ఎవఅంబం.ప్రశీజ.అఅ పోర్టల్‌లో సెల్ఫ్ ఎన్యుమరేషన్‌కు వీలు కల్పించాం. 15 రోజులపాటు సెల్ఫ్ ఎన్యుమరేషన్ కార్యక్రమం ఉంటుంది. మొదటిసారి డిజిటల్ రూపంలో జనాభా లెక్కలు సేకరిస్తున్నాం. ప్రజలు స్వతహాగా వివరాలు నమోదు చేసుకోవచ్చు. సెల్ఫ్ ఎన్యుమరేషన్ 16 భాషల్లో అందుబాటులో ఉంటుంది"

# మే 1 నుంచి ప్రభుత్వ నిర్వహణలోకి రానున్న హైదరాబాద్ మెట్రో

హైదరాబాద్ మెట్రో రైలు విషయంలో ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. మే 1 నుంచి ప్రభుత్వ నిర్వహణలోకి హైదరాబాద్ మెట్రోరైలు రానుంది. ఈమేరకు హైదరాబాద్ మెట్రో రైలు నిర్వహణకు ప్రభుత్వం కమిటీ వేసింది. సీఎస్ రామకృష్ణారావు ఛైర్మన్‌గా మెట్రోరైలు కమిటీ ఏర్పాటు చేయగా హెచ్ఎంఆర్ఎల్ నిర్వహణకు 10 మంది సభ్యులతో కమిటీ ఏర్పాటు చేసింది. హెఎంఆర్ఎల్ ఎండీగా ఐఏఎస్ అధికారి సర్ఫరాజ్ అహ్మద్ బాధ్యతలు తీసుకోనున్నారు. హెచ్ఎంఆర్ఎల్ డైరెక్టర్లుగా జయేశ్‌రంజన్, వికాస్‌రాజ్, సందీప్ కుమార్ సుల్తానియా, శివధర్‌రెడ్డి, అశోక్‌రెడ్డి, జితేశ్ వి.పాటిల్ ఉండగా హెచ్ఎంఆర్ఎల్ జాయింట్ ఎండీగా శివేంద్రప్రతాప్ నియామకమయ్యారు.

**మెట్రో ఈక్విటీ కొనుగోలుకు రూ.13,615కోట్లు కావాలి**

ఈ నెలాఖరులోగా(ఏప్రిల్) హైదరాబాద్ మెట్రో రైలు ప్రాజెక్టు స్వాధీనానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చకచకా అడుగులు వేస్తోంది. ఈ మేరకు మొదటి దశ స్వాధీనానికి అవసరమైన టువంటి ప్రక్రియకు సంబంధించి జీవో నం.127ను మెట్రోపాలిటన్ ప్రాంతం, పట్టణాభివృద్ధి శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ జయేశ్‌రంజన్ శుక్రవారం జారీచేశారు. ఎల్‌అండ్‌టీకి ఉన్న 100 శాతం ఈక్విటీ వాటా కొనుగోలు చేయడం, ఐఆర్ఎఫ్‌సీ నుంచి లోన్, ఒప్పందాల అమలు, ఇతర అంశాలతోపాటు కేబినెట్ సబ్‌కమిటీ చేసిన సిఫార్సులతో హైదరాబాద్ మెట్రో రైలు లిమిటెడ్(హెచ్ఎంఆర్ఎల్) ఎండీ పలు ప్రతిపాదనలు చేశారు. వీటిపై గురువారం కేబినెట్ భేటీలో తీసుకున్న నిర్ణయాల మేరకు తాజాగా ప్రభుత్వం అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. టేకోవర్‌కు సంబంధించి షేర్ పర్చేజ్ అగ్రిమెంట్, ఐఆర్ఎఫ్‌సీ నుంచి లోన్?, రాష్ట్ర ప్రభుత్వం నుంచి అండర్‌టేకింగ్ లేఖ, ప్రభుత్వ గ్యారంటీ, ఆర్‌బీఐ (రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా) నుంచి డైరెక్ట్ డెబిట్ మాండేట్, రుణ



టర్మ్‌షీట్, త్రైపాక్షిక ఒప్పందం, హెచ్ఎండీఏ నుంచి ఈక్విటీ నిధుల సమీకరణతోపాటు పలు అంశాలను ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. మెట్రో ప్రాజెక్టు స్వాధీన ప్రక్రియను పూర్తి చేసేందుకు అవసరమైన షేర్ పర్చేజ్ అగ్రిమెంట్, త్రైపాక్షిక ఒప్పందాలపై సంతకాలు చేసేందుకు హైదరాబాద్ మెట్రో రైలు లిమిటెడ్(హెచ్?ఎంఆర్?ఎల్) ఎండీకి ప్రభుత్వం అనుమతిచ్చింది. రూ.13,615 కోట్ల రుణం మంజూరుకు సంబంధించి ఇండియన్ రైల్వే ఫైనాన్స్ కార్పొరేషన్ (ఐఆర్ఎఫ్‌సీ) టర్మ్‌షీట్‌ను సర్కారు ఆమోదించింది. లావాదేవీని పూర్తి చేసేందుకు గ్యారంటీ పత్రాలు, అండర్‌టేకింగ్ లేఖ, డెబిట్ మాండేట్‌లపై సంతకం చేయడానికి ఆర్థిక శాఖ ముఖ్యకార్యదర్శి లేదా ఆయన నియమించిన అధికారికి అధికారం ప్రభుత్వం ఇచ్చింది. స్వాధీనం చేసుకునే ప్రక్రియలో భాగంగా సంబంధిత పక్షాలతో ఎల్‌అండ్‌టీ సంస్థ, ఐఆర్ఎఫ్‌సీ, ఐడీబీఐతో కలిసి ఎస్క్రో అకౌంట్‌లు తెరవడానికి, ఒప్పందాలు చేసుకోవడానికి అనుమతిని మంజూరు చేసింది. ప్రాజెక్టు ఈక్విటీ కోసం సుమారు రూ.1,385 కోట్లను హెచ్ఎండీఏ(హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ) ద్వారా సమీకరణకు ఆమోదించింది. మెట్రో సిబ్బంది నియామకానికి సంబంధించి ఎల్‌అండ్‌టీతో ఒప్పందానికి, ఇతర ఒప్పందాలు, పత్రాలపై సంతకం చేసేందుకు హెచ్ఎంఆర్ఎల్ ఎండీకి అధికారాలను అప్పగించింది. ఈక్విటీ మొత్తం రూ.2 వేల కోట్ల కంటే తక్కువగా ఉన్నందువల్ల కాంపిటీషన్ కమిషన్ ఆఫ్ ఇండియా(సీసీఐ) ప్రస్తావన లేకుండానే లావాదేవీని కొనసాగించేందుకు హెచ్ఎంఆర్ఎల్‌కు అనుమతి ఇచ్చింది

## అజారుద్దీన్, కోదండరామ్ ఎమ్మెల్సీ అభ్యర్థిత్వాలకు లైన్‌క్లియర్

-మొదటిపేజీ తరువాయి

మైనార్టీ సంక్షేమ మంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. ఈ నెల 30వ తేదీతో ఆయనకు ఆరునెలల గడువు ముగియనుంది ఆయన మంత్రిగా కొనసాగాలంటే ప్రమాణ స్వీకారం చేసిన రోజు నుంచి ఆరునెలలలోపు శాసనసభ లేదా శాసనమండలిలో సభ్యుడిగా ప్రాతినిధ్యం వహించాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో ఇటీవల సీఎం లోక్?భవన్?లో గవర్నర్‌తో ప్రత్యేక సమావేశమైన విషయం తెలిసిందే. గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీలుగా కోదండరామ్?, అజారుద్దీన్ పేర్లను రాష్ట్ర మంత్రివర్గం ఇదివరకే ఆమోదించి పంపగా దస్త్రం లోక్?భవన్?లో పెండింగ్?లో ఉంది. ఇదే విషయంపై ఇటీవల రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు, అడ్వొకేట్? జనరల్? ఎ.సుదర్శన్‌రెడ్డి గవర్నర్‌ను కలిసి వివరించిన విషయం తెలిసిందే.

**గవర్నర్ ఆమోదంతో లైన్ క్లియర్**

అయితే ఈ సమావేశానికి ఐటీ, పరిశ్రమలు, శాసనసభా వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుతో కాలిసి గవర్నర్ శుక్లాతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక భేటీ నిర్వహించడంతో ప్రాదాన్యత సంతరించుకుంది. అయితే గవర్నర్ వెంటనే తమ ఆమోదం తెలుపుతారా అదనపు సమాచారం కావాలని ప్రభుత్వాన్ని కోరతారా? అనే సందేహాలు ఉండేవి. చివరిగా గవర్నర్ ఆమోదంతో అందరి సందేహాలు తొలగిపోయాయి.

**అసలేం జరిగిందంటే ?**

అయితే తెలంగాణ జనసమితి అధ్యక్షుడు కోదండరామ్ 2024 ఆగస్టు 16న ఎమ్మెల్సీగా ప్రమాణ స్వీకారం చేశారు. మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి ఆయనతో ప్రమాణం చేయించారు. ఆయన గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీగా బాధ్యతలు చేపట్టారు.

**గతంలో సుప్రీం కోర్టు వ్యాఖ్యలు**

అయితే ఆయనను ఎమ్మెల్సీగా నియమిస్తూ తెలంగాణ గవర్నర్ తీసుకున్న నిర్ణయాన్ని సుప్రీంకోర్టు రద్దు చేసింది. ఆయనను ఎమ్మెల్సీగా నియమిస్తూ 2024 జనవరి 27న జారీ చేసిన గెజిట్ నోటిఫికేషన్‌ను రాష్ట్ర హైకోర్టు అప్పట్లో కొట్టివేసింది. ఆ ఉత్తర్వులను ఆయన సుప్రీం కోర్టులో సవాల్ చేయలేదని, అందువల్ల 2024 ఆగస్టు 14న సుప్రీం కోర్టు జారీ చేసిన మధ్యంతర ఉత్తర్వుల కారణంగా ప్రయోజనం పొందే అర్హత వారికి లేదని ధర్మాసనం స్పష్టం చేసింది.

**వాటిని పరిగణలోకి తీసుకుని మధ్యంతర ఉత్తర్వులు**

నాడు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసే సమయంలో కొంత పొరపడ్డామని, గవర్నర్? ఇకమీదట ఏదైనా కొత్త నియామకాలు చేపడితే అవి కోర్టు తుదితీర్పునకు లోబడి ఉంటాయని చెప్పడం తమ ఉద్దేశం అని తెలిపింది. తప్పితే, ఇదివరకే చేసిన సిఫార్సులను అమలు చేయడం కాదని పేర్కొంది. అందువల్ల హైకోర్టు తీర్పును సవాల్? చేస్తూ దాఖలైన పిటిషన్లను పరిగణనలోకి తీసుకుని మధ్యంతర ఉర్వులను సవరిస్తున్నట్లు ప్రకటించింది.

**సుదీర్ఘ నిరీక్షణ అనంతంలిం గవర్నర్ ఆమోదం**

తర్వత 2025 ఆగస్టు 30న రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా ఎమ్మెల్సీ స్థానాలను భర్తీ చేసే ప్రక్రియను చేపట్టింది. దీనిలో భాగంగా కాంగ్రెస్ ప్రభుత్వం కోదండరామ్, మహమ్మద్ అజారుద్దీన్ పేరును గవర్నర్ కోటా కింద ఎమ్మెల్సీలుగా సిఫార్సు చేసింది. సుదీర్ఘ నిరీక్షణ అనంతరం రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా వీరి నియామక ఫైళ్లపై సంతకం చేశారు. ఎట్టకేలకు గవర్నర్ ఆమోదముద్ర పడటంతో ఎమ్మెల్సీల నామినేషన్‌పై నేడో, రేపో గెజిట్ నోటిఫికేషన్లు విడుదల కానున్నాయి. సోమవారం కోదండరామ్, అజారుద్దీన్ ఎమ్మెల్సీలుగా ప్రమాణం చేసే అవకాశం ఉంది.

## ఆర్టీసీ విలీన ప్రక్రియ పూర్తి చేస్తాం

-మొదటిపేజీ తరువాయి

వల్లనో ఆర్టీసీ ఉద్యోగులు సమ్మెకు దిగారన్న పొన్న ప్రభాకర్? అంత పెద్ద వ్యవస్థపై నిర్ణయాన్ని కొన్ని గంటల్లో తీసుకునేది కాదని అన్నారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న అంశాలపై నిర్ణయం తీసుకున్నామని, విలీనంపై విధివిధానాల కోసం ప్రక్రియ ప్రారంభిస్తామని తెలిపారు. ఆర్టీసీ గుర్తింపు కార్మిక సంఘాల ఎన్నికలు నిర్వహిస్తామని, కార్మిక సంఘాల ప్రతినిధులు, ఆర్టీసీ అధికారులతో చర్చించి విలీన ప్రక్రియ పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు.

**సిబ్బందిని వేధిస్తే ఊరుకోం**

ఆర్టీసీ డ్రైవర్ శంకర్‌గౌడ్ మృతి విషయంలో కొన్ని పార్టీలు శవరాజకీయం చేశాయని మంత్రి విమర్శించారు. గత ప్రభుత్వం చర్చలకు తావులేకుండా నిరంకుశంగా వెళ్లారని ఆరోపించారు. ఈ ప్రభుత్వం మాత్రం చర్చలు జరిపి సానుకూలంగా స్పందించిందని కొనియాడారు. గత ప్రభుత్వం రాష్ట్ర ఖజానాను ఖాళీ చేసి వెళ్లిపోయిందని, కార్మికులు అడిగినంత ఇవ్వాలని తమకు ఉన్నప్పటికీ ఆర్థిక పరిస్థితి వల్ల ఇవ్వలేని పరిస్థితి అని పేర్కొన్నారు. ఆర్టీసీ కార్మికుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నామని మరోసారి స్పష్టం చేశారు. ఆర్టీసీ సిబ్బందిని పైఅధికారులు వేధిస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు.

**తెలంగాణ ఆర్టీసీ నంబర్ వన్‌గా ఉండాలి**

రవాణా శాఖ మంత్రిగా ఆర్టీసీలో అనేక సంస్కరణలు తీసుకురావడానికి సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో కలిసి అనేక ప్రయత్నాలు చేస్తున్నామని పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఆర్టీసీలో ప్రయాణించే పేద ప్రజలకు సౌకర్యంగా ఉండాలని, ఆర్టీసీ కార్మికులు కూడా పేదవారని, వారి సమస్యలు కూడా పరిష్కారం కావాలని తెలిపారు. ఈ రెండు కలయిక ద్వారా సంస్థ అభివృద్ధి కావాలని ఆకాంక్షించారు. దేశంలో తెలంగాణ ఆర్టీసీ నంబర్ వన్?గా ఉండాలన్నదే తమ సంకల్పమని, ఆ దిశగా తాము కృషి చేస్తున్నామని స్పష్టం చేశారు.

**కవిత పార్టీతో మాకు ఇబ్బంది లేదు**

కల్వకుంట్ల కవిత రాజకీయ పార్టీ 'తెలంగాణ రాష్ట్ర సేన (టీఆర్ఎస్?)'పై ఈ సందర్భంగా స్పందించారు. కవితకు అభినందనలు తెలుపుతూ, టీఆర్ఎస్?కు స్వాగతం పలుకుతున్నామని తెలిపారు. రాజకీయ పార్టీ పెట్టుకుంటే తమకు ఇబ్బంది లేదని ఆయన స్పష్టం చేశారు. ఒక పార్టీ నేత ప్రభుత్వానికి సలహాలు, సూచనలు ఇస్తే బాగుంటుందని సూచించారు. పార్టీ ప్రకటించిన తొలిరోజే సీఎం రేవంత్ రెడ్డిని దూషించటం సరికాదని హితువు పలికారు. "ఆర్టీసీ డ్రైవర్ శంకర్‌గౌడ్ మృతి విషయంలో కొన్ని పార్టీలు శవరాజకీయం చేశాయి. టీజీఎస్?ఆర్టీసీ విలీనం గురించి ఎన్నికల అజెండాలో పెట్టాం. ఆర్టీసీ కార్మికుల సమస్య పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఎప్పుడూ ప్రయత్నిస్తూనే ఉంది. గత ప్రభుత్వం చర్చలకు తావులేకుండా నిరంకుశంగా వెళ్లారు. ఈ ప్రభుత్వం మాత్రం చర్చలు జరిపి సానుకూలంగా స్పందించింది. ఆర్టీసీ కార్మికుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం. ఆర్టీసీ సిబ్బందిని పైఅధికారులు వేధిస్తే ఊరుకునేది లేదు. కవితకు అభినందనలు. టీఆర్ఎస్?ను స్వాగతిస్తున్నాం. ఒక పార్టీ నేత ప్రభుత్వానికి సలహాలు, సూచనలు ఇస్తే బాగుంటుంది. పార్టీ ప్రకటించిన తొలిరోజే సీఎం రేవంత్ రెడ్డిని దూషించటం సరికాదు"

## ఛత్తీస్?గఢ్?లో ఉన్న మావోయిస్టులు కూడా ఇవాళ లొంగిపోయారు : డీజీపీ శివధర్ రెడ్డి

మావోయిస్టు పార్టీకి మరో భారీ ఎదురు దెబ్బ తగిలింది. ఛత్తీస్?గఢ్ బెటాలియన్-1 కు చెందిన 47 మంది మావోయిస్టులు తెలంగాణ డీజీపీ శివధర్‌రెడ్డి ఎదుట లొంగిపోయారు. లొంగిపోయిన వారిలో దండకారుణ్య సౌత్?జోన్?కు చెందిన కీలకమైన నాయకులు హేమ్లా ఐతు అలియాస్ విజ్జా, పోడియం లచ్చు అలియాస్ మనోజ్ కూడా ఉన్నారు. ఈ లొంగుబాటుతో దక్షిణ బస్తర్ డివిజన్?లో దాదాపుగా ఆపార్టీ ఉనికిని కోల్పోయింది. కీలక నాయకత్వంతో పాటు సాయుధ కేడర్ మొత్తం బయటకు రావడంతో ఆ ప్రాంతంలో మావోయిస్టు పార్టీ పునాదులు కదిలిపోయాయి. వీరు లొంగిపోవడమే కాకుండా, పెద్ద ఎత్తున అధునాతన ఆయుధాలను పోలీసులకు అప్పగించారు. అందులో 32 తుపాకులు, ఒక ూవీ+, 4ూఖ-47లు, 3 ూూ= రైఫిళ్లు, ఇన్సాస్, 9 ఎంఎం పిస్టల్, బి.జి.ఎల్ గన్లతో సహా పలు రకాల ఆయుధాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. 515 తూటాలు వివిధ రకాల కాలిబర్‌లకు చెందిన మందుగుండు సామాగ్రి ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. సరెండర్ అయిన వారికి రూ.1.20 కోట్ల పునరావాస ప్యాకేజీ అందిస్తామని డీజీపీ చెప్పారు. ఒక్కొక్కరికి రూ.25,000 తక్షణ సహాయం చేస్తున్నామని వివరించారు. అదనంగా కేంద్రప్రభుత్వం ఇచ్చే ప్రోత్సాహం కూడా అందిస్తామన్నారు.

## సంపాదకీయం

# 'డిజిటల్' కేసులో పరిహారం!

జేబులు కొట్టడం, దారి దోపిడీలు చేయడం, దొంగతనాలకు పాల్పడటం, నమ్మించి మోసగించటం... ఇవన్నీ పాతకాలపు నాటు పద్ధతులు. 2016లో పెద్దనోట్ల రద్దుతర్వాత దేశంలో ఆన్‌లైన్ చెల్లింపులు మొదలై వీటన్నిటినీ మరపించేలా కొత్త కొత్తదోపిడీ విధానాలు రంగప్రవేశం చేస్తున్నాయి. అందులో తాజాగా వచ్చిచేరిన 'డిజిటల్ అరెస్టు' వీటన్నిటినీ తలదన్నింది. ఈ మార్గాల్లో పౌరులు కోల్పోతున్న సొమ్ము వందల్లోంచి వేలల్లోకి... అక్కడి నుంచి లక్షలు దాటి ఇప్పుడు కోట్లాది రూపాయలకుచేరటంతో మన వ్యవస్థల్లో చలనం వచ్చినట్టుంది. అందుకే కావొచ్చు... ఇటీవల రిజర్వ్ బ్యాంకు స్వతంత్ర ప్రతినిధి (ఆంబుడ్స్‌మన్) ఈ తరహాలో రూ. 22.93 కోట్లు పోగొట్టుకున్న నరేష్‌చంద్ర అనే బాధితుడికి కోటీ 31 లక్షల పరిహారం చెల్లించాలని అయిదు బ్యాంకుల్ని ఆదేశించింది. ఆన్‌లైన్ లావాదేవీల్లో లక్షలాది రూపాయలు నష్టపోతున్న బాధితులు తమ మూర్ఖత్వాన్నీ, తెలివితక్కువతనాన్నీ తిట్టుకుని రోదిస్తు న్నారు. 'డిజిటల్ అరెస్టు'లో రూ. 8 కోట్లు కోల్పోయిన ఉదంతంలో పంజాబ్ మాజీ ఐజీ అమర్‌సింగ్ చాహల్ ఆత్మహత్యాయత్నం చేశారు. ఫిర్యాదులిచ్చినా తిరిగి రాబట్టుకునే సొమ్ము అంతంతమాత్రంగానే ఉంటున్నది. సైబర్ క్రైమ్ విభాగాలకు ఫిర్యాదు చేయ టానికి వెళ్తే 'ఆ మాత్రం తెలియదా?' అంటూ ఎదురయ్యే చీవాట్లను భరించటంఅదనపు కష్టం. ఇలాంటి పరిస్థితుల్లో ఆంబుడ్స్‌మన్ నిర్ణయం బాధితులకు ఉపశమనం కలిగిస్తుంది. ఈ మోసాలు పౌరులకు పెద్ద తలనొప్పిగా మారాయి. సాక్షాత్తూ ప్రధాని నరేంద్ర మోదీయే 'మన్ కీ బాత్'లో 'డిజిటల్ అరెస్టు' మోసాల గురించి ప్రస్తావించాక, మీడియాలో రిజర్వ్ బ్యాంకు తరఫున భారీ ప్రకటనలివ్వటం మొదలైనాక జనంలో ఏదోమేరకు చైతన్యం వచ్చిన సంగతి వాస్తవమే. అయితే ఇంకా మోసపోయేవారిసంఖ్య తగ్గటం లేదు. గత ఆర్థిక సంవత్సరంలో ఈ మోసాల కారణంగా జనం రూ. 34,771 కోట్లు కోల్పోయారని రిజర్వ్ బ్యాంకు గణాంకాలు చెబుతున్నాయి. ఇందులో కేవలం 'డిజిటల్ అరెస్టు'ల వాటాయే రూ. 1,900 కోట్లు ఉంది. 2022లో 10.29లక్షలున్న కేసులు 2024 నాటికి 22.68 లక్షలకు చేరాయి. గత మూడేళ్లలో జనం నుంచి మాయగాళ్లు కొట్టేసిన సొమ్ము 1.25 లక్షల కోట్లు! సిబ్బంది కొరత మాటెలావున్నా, పోలీసు విభాగాల్లో సైబర్ నేరాల దర్యాప్తు, ఆచూకీ రాబట్టడం వగైరాల్లో చాలామందికి పకడ్బందీ శిక్షణ లేదు. ఈ మాదిరి నేరాలకు పాల్పడేవారు వేరే రాష్ట్రాలకూ, వేరే దేశాలకూచెందినవారు కావటం, దర్యాప్తు చేయటానికి పెద్ద ఆటంకంగా మారింది. నియంత్రణ వ్యవస్థలు ఈ మోసాలను అరికట్టడానికి కొత్త ఉపకరణాలు కనుక్కొనే లోగానే నేరగాళ్లు ఏఐతో, ఇతరేతర మార్గాల్లో జనాన్ని బురిడీ కొట్టిస్తున్నారు. 2000 సంవత్సరంలో వచ్చిన ఐటీ చట్టం, 2023 నాటి డేటా పరిరక్షణ చట్టం వంటివి మధ్యస్తంగా ఉండే సంస్థలపై బాధ్యత మోపాయి. కానీ ఆచరణలో పెద్దగా ప్రయోజనం లేదు. ఆంబుడ్స్‌మన్ నిర్ణయం ఈ నేరాలను అరికట్టడంలో ముందడుగు. అసలు ఖాతాదార్లకు తెలియకుండా దొంగసొమ్ము రాకపోకలకు నేరగాళు వాడుకునే 'మ్యూల్ అకౌంట్‌ల' పనిబట్టేందుకు ఇటీవల ప్రయత్నాలు మొదలయ్యాయి. బ్యాంకుల నిష్క్రియాపరత్వం కావొచ్చు... సిబ్బంది కుమ్మక్కుకావటం వల్ల కావొచ్చు ఇవిఇన్నాళ్లూ నిర్నిరోధంగా సాగిపోయాయి. తెలుగు రాష్ట్రాల్లో నేరగాళ్లకు సహకరించేబ్యాంకు సిబ్బందిని పోలీసులు ఈమధ్యే అరెస్టు చేశారు. ఈ మార్గంలోనే ఆంబుడ్స్‌మన్ సైతం ఖాతాదారు వివరాలు సేకరించటానికి, ద్రవ్య అక్రమ చలామణిని అరికట్టడానికి ఉన్న నిబంధనల్ని పాటించటంలో అలసత్వం ప్రదర్శించినందుకు నరేష్‌చంద్ర కేసులో పరిహారం ఇవ్వాలని ఆదేశించింది. అయితే దీంతో ఆయన సంతృప్తిపడదల్చుకోలేదు. రిజర్వ్‌బ్యాంకు మార్గదర్శకాలు పాటించని ఆ బ్యాంకులనుంచి తాను కోల్పోయిన మొత్తం రూ. 22.93 కోట్లు ఇవ్వటంతోపాటు నష్టపరిహారం, వడ్డీ, క్యాపిటల్ గెయిన్స్ పన్నుకయ్యే ఖర్చుతో సహా వెనక్కి ఇప్పించాలని నరేష్‌చంద్ర పోరాడతానంటున్నారు. ఆన్‌లైన్ మోసాల్లో బాధితులుగా మారుతున్నవారు పోలీసు కేసులు పెట్టడంతోపాటు, బ్యాంకుల అలసత్వం ఉన్నపక్షంలో వాటిపై కూడా న్యాయపోరాటం చేయటానికినరేష్‌చంద్ర కేసు స్ఫూర్తిగా నిలుస్తుందనటంలో సందేహం లేదు.

# మణిపూర్ చక్కబడేదెన్నడు?




మణిపూర్‌లో తీవ్ర హింసాత్మక ఘటనలు జరిగి మూడేళ్లు కావస్తున్నా అక్కడింకా పరిస్థితులు చక్కబడలేదని తాజా ఉదంతాలు నిరూపిస్తున్నాయి. 2023 మే నెలలో హింసకు దారితీసిన వదంతులే ఇప్పటికీ ఆ రాష్ట్రాన్ని శాసిస్తున్నాయి. బీరేన్ సింగ్ నాయ కత్వంలోని బీజేపీ ప్రభుత్వం పోయి రాష్ట్రపతి పాలన వచ్చింది. అది ఏడాది కొనసాగాక మొన్న ఫిబ్రవరిలో ఆ పార్టీకి చెందిన ఖేమ్‌చంద్ సింగ్ ఆధ్వర్యాన కొత్త ప్రభుత్వం ఏర్పడింది. కానీ పరస్పర అపనమ్మకం, జాతి విద్వేషాలు ఆగిందిలేదు. వందలాదిమంది ఆయుధాలు ధరించి గుంపులుగా బయల్దేరి ఊళ్లమీద పడి నిర్విచక్షణగా హత్యాకాండకు, అత్యాచారాలకు పాల్పడటం, ప్రార్థనా స్థలాలు, ఆవాసాలు తగలబెట్టడం ఇప్పుడు లేక పోవచ్చుగానీ... అవతలి పక్షంపై ఆగ్రహావేశాలు తగ్గలేదు. తరచుగా నిరసన ప్రదర్శనలు జరగటం, రహదారులను స్తంభింపజేయటం ఆగలేదు. కేంద్ర బలగాల సంఖ్యను పెంచటం, నిరంతర పహారా వంటివి హింసాత్మక ఉదంతాలను గణనీయంగా కట్టడి చేశాయి. కానీ ఇప్పటికీ విద్వేషాన్ని రెచ్చగొట్టే సందేశాలూ, తప్పుడు సమాచారం వ్యాప్తిలోనే ఉన్నాయి. ఈ నెల మొదటివారంలో ఒక ఇంటిపై బాంబుపడి ఇద్దరు పసిపిల్లలు ప్రాణాలు కోల్పోయిన ఉదంతమే ఇందుకు ఉదాహరణ. ఆ బాంబు కుకీలు నివసిస్తున్న ప్రాంతంనుంచి వచ్చిపడిందనీ, వారికి భద్రతా బలగాలు కొమ్ముకాస్తున్నా యనీ ప్రచారం వెల్లువెత్తడంతో జనం ఒక సీఆర్‌పీఎఫ్ శిబిరంపై దాడి చేశారు. అటుగా వాహనంలో వెళ్తున్న అస్సాం రైఫిల్స్‌కు చెందిన అధికారిని గుంపు చుట్టుముట్టి దౌర్జన్యం చేసింది. ఆయనను హతమార్చేందుకు ప్రయత్నిస్తుండగా భద్రతా బలగాలు రక్షించగలిగాయి. మొన్న మంగళవారం ఒక కార్యక్రమానికి హాజరయ్యేందుకు వెళ్తున్న ముఖ్య మంత్రిని ఆందోళనకారులు అడ్డుకున్నప్పుడు లాఠీచార్జి చేసినా, బాష్పవాయు గోళాలు ప్రయోగించినా ఫలితం లేకపోయింది. చివరకు హెలికాప్టర్ తెప్పించుకుని అక్కడినుంచి ఆయన బయటపడాల్సి వచ్చింది. అంతకుముందు ఒక మాజీ సైనికుడితో సహా ఇద్దరు నాగా జాతీయుల్ని మిలిటెంట్లు హతమార్చారు. మూడేళ్ల క్రితం మెయితీలకూ, కుకీలకూ మధ్య వైరం హింసకు దారితీయగా ఇప్పుడు మెయితీల గురి నాగాలపై కూడా పడింది. ఒక పద్ధతి ప్రకారం వదంతులు వ్యాప్తిచేయటం, ప్రజల్లో భయాందోళనలు సృష్టించటం ఇంకా ఆగలేదు. అప్పటికీ, ఇప్పటికీ తేడా ఏమంటే... ఆ వదంతుల్ని ఖండిస్తూ పోలీసులు ప్రకటనలు విడుదల చేస్తున్నారు. కానీ ఉద్రిక్తతల్ని ఆపటంలో అవి పెద్దగా ఉపయోగపడటం లేదు. గతంలో బీరేన్ సింగ్ ప్రభుత్వ హయాంలో మెయితీలకు చెందిన సాయుధ మిలిటెంట్ సంస్థ ఆరంబాయ్ టెంగోల్‌ను చూసీచూడనట్టు వదిలేశారు. కుకీల 'దురాక్రమణల్ని' అడ్డుకునే పేరిట ఏర్పడిన ఆ సంస్థ కుకీలకూ, నాగాలకూ మాత్రమే కాదు, వారిని ప్రశ్నించే మెయితీలకు సైతం పెద్ద బెడదగా పరిణమించింది. బెదిరించటం, దౌర్జన్యం చేయటం, బలవంతంగా వసూళ్లకు పాల్పడటం ఆ సంస్థకు నిత్యకృత్యమైంది. మూడేళ్లనాటి ఉదంతాలతో పోలిస్తే హింసాత్మక ఘటనలు తగ్గివుండొచ్చు. కానీ ఇప్పటికీ సమాజం చీలికలు, పేలికలుగా ఉంది. మెయితీలూ, కుకీలూ ఒకరి ప్రాంతంలోకి ఒకరు వెళ్లలేకపోతున్నారు. పనిచేయగలిగిన సత్తావుండి అది దొరుకుతుందన్న భరోసా ఉన్నచోటకు పోలేకపోవటం, పై చదువులకు అర్హతలున్నా ఊరు కదల్లేక పోవటంకన్నా మించిన హింస ఏం ఉంటుంది? పరిమిత వనరులు, ఉపాధి లేమి, భిన్న తెగలకు సరైన ప్రాతినిధ్యం లేకపోవటంవంటి కారణాలవల్లే అసంతృప్తి అవధులు దాటుతోంది. యువతకు ఉపాధి కల్పన, విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించటం, వారికి మెరుగైన అవకాశాలు రావటానికి తగిన ప్రణాళికలు రూపకల్పన చేయటంవంటి ప్రయత్నాలు ఎక్కడా కనబడవు. కనుకనే మిలిటెంట్ సంస్థల ఆధిపత్యం సాగుతోంది. మౌలిక సమస్యల్ని పరిష్కరించలేని రాజకీయ నేతలు ఓట్లు రాబట్టుకోవటానికి మాత్రం ఆయా తెగల్ని శాసించగల మిలిటెంటు సంస్థలకు సహకరిస్తున్నారు. ఇది కొనసాగినంత కాలమూ మణిపూర్ నెత్తురోడుతూనే ఉంటుంది. ఇప్పటికైనా పాలకులు కళ్లు తెరిస్తేనే ఆ రాష్ట్రం తెరిపిన పడుతుంది.

# విదేశీ అధినేతల పర్యటనలకు ప్రాముఖ్యత



ఎన్నికల ప్రచారపర్వం ఊపందుకున్నప్పుడు మన దేశంలో విదేశీ అధినేతల పర్యటనలకు ప్రాముఖ్యత తగ్గిపోతుంది. దానికితోడు అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ పశ్చిమాసియాలో సృష్టించిన అనిశ్చితి సరేసరి. ఇలాంటి వాతావరణంలో ఆదివారం భారత్‌కొచ్చి మూడు రోజులు పర్యటించి వెళ్లిన దక్షిణ కొరియా అధ్యక్షుడు లీ జే మ్యూంగ్‌కు ఇది అర్థమై ఉంటుంది. ఎందుకంటే ఆ పర్యటనకు మీడియా ఇచ్చిన ప్రాధాన్యత అంతంతమాత్రమే. ఆ మాటెలా ఉన్నా ప్రధాని నరేంద్ర మోదీతో ఆయన జరిపిన ద్వైపాక్షిక చర్చలు ఫలవంతమయ్యాయి. ఇరు దేశాల మధ్యా ప్రస్తుతం ఉన్న 2,700 కోట్ల డాలర్ల వాణిజ్యాన్ని 2030 నాటికి 5,000 కోట్ల డాలర్లకు చేర్చాలని అధినేతలిద్దరూ సంకల్పించారు. ఇందుకోసం 2010లో కుదిరిన సమగ్ర ఆర్థిక భాగస్వామ్య ఒప్పందం(సెపా)ను మరింత విస్తృతపరచాలని నిర్ణయించారు. భారత్‌లో విదేశీ పెట్టుబడుల్లో దక్షిణ కొరియా అయిదో స్థానంలో ఉంది. మ్యూంగ్ తనతోపాటు 200 మంది వ్యాపార వేత్తలూ, సీఈవోలతో కూడిన భారీ ప్రతినిధి బృందాన్ని వెంట బెట్టుకుని వచ్చారు. కృత్రిమ మేధ(ఏఐ), రక్షణ, షిప్పింగ్, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు, క్రీడలు, సాంస్కృతిక రంగం వగైరాల్లో పలు ఒప్పందాలు కుదిరాయి. ఇరు దేశాల మధ్యా సాంస్కృతిక బంధానికి ఎంతో చరిత్ర ఉందంటారు. క్రీస్తుశకం 48లో అయోధ్యకు చెందిన యువతి హియోహాంగ్‌కు అప్పటి కొరియా రాజు సురోతో వివాహమైందని 13వ శతాబ్దంనాటి ఒక బౌద్ధ సన్యాసి రచించిన పుస్తకంలో ఉంది.అందులో ప్రస్తావించిన 'అయుత' ఇప్పటి అయోధ్య అయివుంటుందని అనేకులు భావిస్తారు. కొరియా చరిత్రలో ఆమె యువరాణి సురిరత్నగా నమోదైంది. అయోధ్యలో సరయూ నది ఒడ్డున రాణి హియోహాంగ్ స్మృతిలో ఒక పార్క్ నిర్మించారు. 2019లో ఆమె స్మారకార్థం రెండు దేశాలూ కలిసి ఒక స్టాంపు విడుదల చేశాయి. నాలుగో శతాబ్దంలో బౌద్ధం ఆ దేశంలో ప్రవేశించింది. 1973లో తొలిసారి దౌత్య సంబంధాలు ఏర్పడినా... అంతకు చాన్నాళ్లముందే 1950--53 నాటి కొరియా యుద్ధకాలంలో మన దేశంనుంచి వైద్య బృందాలు అక్కడికెళ్లి పనిచేశాయి. ప్రచ్ఛన్న యుద్ధకాలం ముగిశాక తొలిసారి 1993లో అప్పటి ప్రధాని పీవీ నరసింహారావు ఆ దేశంలో పర్యటించారు. ప్రత్యేకించి ఎలాంటి కారణాలూ లేకపోయినా 2018లో అప్పటి దక్షిణ కొరియా అధ్యక్షుడు మూన్ జే--యీ తర్వాత దౌత్య సంబంధాల్లో స్తబ్దత ఆవరించింది. అప్పుడూ, అంతకుముందూ కుదిరిన ఒప్పందాలు ఆచరణలో కొనసాగుతున్నా ఇరు దేశాల వాణిజ్య లోటుపై మన దేశానికి కొంత అసంతృప్తి ఉంది. ప్రస్తుత ద్వైపాక్షిక వాణిజ్యం 2,700 కోట్ల డాలర్లున్నా, అక్కడినుంచి మనకొచ్చే దిగుమతుల విలువ దాదాపు 2,100 కోట్ల డాలర్లు. మన ఎగుమతుల విలువ 600 కోట్ల డాలర్లు మించదు. ఇందులో సమతౌల్యత సాధించాలని మన దేశం ఎప్పటినుంచో భావిస్తోంది. ఆరోగ్య కారణాలు చూపి, చీడపీడలు చూపి మన సాగు ఉత్పత్తులను దక్షిణ కొరియా అడ్డుకుంటోంది. నౌకా నిర్మాణంలో దక్షిణ కొరియా సాంకేతికతకు ప్రపంచవ్యాప్తంగా మంచిపేరుంది. పర్యావరణ హితమైన, అత్యాధునిక నౌకల నిర్మాణంలో, ఇతర నౌకాసంబంధ కార్యకలాపాల్లో మన దేశానికి సహకరించేందుకు అంగీకరించింది. నౌకాశ్రయాలను సాంకేతికంగా ఉన్నతస్థాయికి తీసుకెళ్లటంతోపాటు ఓడల మరమ్మతుకు, అతి పెద్ద ఓడల నిర్మాణానికి తోడ్పడే భారీ డ్రై డాక్‌ల నిర్మాణంలో పాలుపంచుకునేందుకు ముందుకొచ్చింది. రక్షణ రంగంలో ఇప్పటికే ఉన్న బంధాన్ని మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లాలని ఇరు దేశాలూ నిర్ణయించాయి. విమాన విధ్వంసక ఫిరంగులు, క్షిపణి వ్యవస్థలు ఇక్కడే అభివృద్ధిపరచడానికి, అందుకు అవసరమైన అత్యాధునిక సాంకేతికతల్ని బదిలీ చేయటానికి దక్షిణ కొరియా అంగీకరించింది. యుద్ధక్షేత్రంలో చురుగ్గా కదిలి, శత్రుసైన్యాన్ని దీటుగా ఎదుర్కొనగలిగే సెల్ఫ్ ప్రొపెల్డ్ గన్ కె9 వజ్ర కొరియా సహకారంతోనే ఇక్కడ ఉత్పత్త వుతోంది. ఇవిగాక సెమీ కండక్టర్లు, ఫార్మా, జౌళి, ఐటీ రంగాలకు సైతం సహకారం విస్తరించటానికి సంకల్పించారు. ప్రపంచవ్యాప్తంగా అనిశ్చితి అలుముకున్న వర్తమానంలో భిన్న రంగాల్లో మరింత దగ్గరయ్యేందుకు దక్షిణ కొరియా అధినేత పర్యటన దోహదపడుతుంది.

## అంతరించే అంచున పెంగ్విన్ జాతి పక్షులు... !

చూపులకు అందంగా, నలుపు తెలుపుల సమ్మిళిత వర్ణాలతో బొద్దుగా, ముద్దుగా కనిపించే ఎగురలేని అమాయక పెంగ్విన్ జల పక్షుల సంఖ్య రోజు రోజుకు తరుగుతూ అంతరించే అంచున ఉన్నట్లు తాజా అధ్యయనాలు వెల్లడించడం ఒక జీవవైవిధ్య విఘాత హెచ్చరికగా భావించాలి. అన్ని రకాల జీవజాతుల మనుగడతోనే మానవాళి పర్యావరణ హిత ఉజ్వల భవిత ఆధారపడి ఉందని మనకు తెలుసు. పెంగ్విన్ అనబడే నీటిలో నివసించే పక్షులు అధికంగా దక్షిణ అర్ధగోళం(సదరన్ హెమిస్ఫియర్)లో సహజంగా కన్పిస్తాయి. పెంగ్విన్‌లలో దాదాపు 20 రకాల జాతులు ఉన్నాయి. వీటిలో అతి పెద్ద రకాలను 'ఎంపెరర్ పెంగ్విన్'లుగా, అతి చిన్న జాతి పెంగ్విన్లు ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ తీరప్రాంతాల్లో కనిపిస్తాయి. వీటి సహజ నలుపు తెలుపు వర్ణాలు సముద్ర జలాల్లో వీటిని వేటాడే జీవుల నుంచి కనిపించకుండా (క్యామోఫ్లాజ్) ఉండడానికి దోహదపడతాయి.పెంగ్విన్ పక్షుల మనుగడ ప్రశ్నార్థకంగా మారిందా ! పక్షుల వర్గంలో ఉన్న పెంగ్విన్‌లు ఎగురలేనప్పటికీ అద్భుతంగా ఏకధాటిగా 60 మైళ్ల వరకు తమ రెక్కల సహాయంతో ఈదడం, 530 మీటర్ల తోతు వరకు డైవింగ్ చేయగలవు. వేగంగా ఈదగల 'జెండా పెంగ్విన్'లు గంటకు 35 కిమీ దూరం ప్రయాణం చేయగలవు. పెంగ్విన్ పక్షి జాతులను కాపాడుకోవడానికి సామాన్య జనాల్లో అవగాహన కల్పించడానికి ప్రతి ఏట 25 ఏప్రిల్ రోజున "ప్రపంచ పెంగ్విన్ దినోత్సవం" పాటించుట ఆనవాయితీగా వస్తున్నది. మానవ కదలికలు లేని ప్రదేశాల్లో స్వేచ్ఛగా జీవించే పెంగ్విన్ పక్షుల మనుగడ కాలక్రమంలో ప్రశ్నార్థకంగా మారుతున్నది. పర్యావరణ కాలుష్యం, భూతాపం, ప్రతికూల వాతావరణ మార్పులు, అతిగా చేపలు పట్టడం, అవి నివసించే ప్రాంతాల్లో మానవ కదలికలు పెరగడం, మానవ అనవసర కదలికలతో పెంగ్విన్ పక్షుల ఉనికి ప్రమాదంలో పడుతున్నది. పర్యావరణ కాలుష్యాన్ని గుర్తించడానికి పెంగ్విన్ పక్షుల విచిత్ర ప్రవర్తనలు గమనించడం జరుగుతుంది. పెంగ్విన్ అవగాహన దినం కార్యక్రమాలు: ప్రపంచ పెంగ్విన్ దినోత్సవం-2026 వేదికగా పెంగ్విన్ పక్షుల గూర్చి వివరాలను తెలుసుకోవడం, వాటి పరిరక్షణకు పటిష్ట కార్యాచరణ

# విద్యాసేవలో తరించిన ఉపాధ్యాయురాలికి ఆత్మీయ వీడ్కోలు

**కష్టాల్లో సుఖాల్లో మార్గదర్శి పాఠశాల, టిపిటిఎఫ్ తోడు ఉంటుంది**
**డైరెక్టర్స్ లక్కాకుల జమున రాణి పాఠశాల ప్రధానోపాధ్యాయుడు లక్కాకుల రవి.**
**ఆవుల రాజేష్ యాదవ్ టి పి టి ఎఫ్ జిల్లా అధ్యక్షుడు**



**అగ్నిధారన్యూస్ గోదావరిఖని25**

శనివారం రోజున పరుశురాంనగర్ లోని మార్గదర్శి విద్యా విహార్ హైస్కూల్లో పనిచేసిన భాగ్యలక్ష్మి ఉపాధ్యాయురాలికి ఉద్యోగ విరమణ సన్మాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి టి పి టి ఎఫ్ పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు ఆవుల రాజేష్ యాదవ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. భాగ్యలక్ష్మి మేడం వివిధ పాఠశాలలో గత 40సంవత్సరాల నుండి ఉపాధ్యాయురాలుగా పనిచేసి చివరి 10 సంవత్సరాలు మార్గదర్శిలో సేవలను అందించి పదవి విరమణ చేశారు. వారి సేవలను గుర్తు చేసుకున్నారు. ఎందరోవిద్యార్థులను, తీర్చిదిద్దిన ఉపాధ్యాయురాలు మహావాడి భాగ్యలక్ష్మి (61)మార్గదర్శి విద్యా విహార్ లో పదవి విరమణ చేస్తున్న సందర్భంగా పాఠశాల డైరెక్టర్స్ లక్కాకుల జమున రాణి పాఠశాల ప్రధానోపాధ్యాయుడు లక్కాకుల రవి తో కలిసి తెలంగాణ ప్రైవేట్ టీచర్స్ ఫోరం పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు ఆవుల రాజేష్ యాదవ్ భాగ్యలక్ష్మి మేడంని ఘనంగా సన్మానించారు. అనంతరం మాట్లాడుతూ... ఆమె చేసిన సేవలను గుర్తిస్తూ కొనియాడారు. ప్రతి ఉపాధ్యాయుని ఉపాధ్యాయులకు ఆదర్శంగా నిలిచి అందరికీ మార్గదర్శకంగా నిలిచారని,ఎందరో విద్యార్థులను తనదైన శైలిలో విద్యాబోధన చేసి బావి పౌరులను తీర్చిదిద్దారని కొనియాడారు. ఈ లాంటి కార్యక్రమాలను ప్రతి పాఠశాలలో నిర్వహించాలని నిరంతర విద్యా సేవలో తరిస్తున్న ఉపాధ్యాయులకు ఆదర్శంగా నిలవాలని పాఠశాల యజమాన్యాలకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో దీపక్,ఉపాధ్యాయుని,ఉపాధ్యాయులు రమేష్ ,కుమార్, సదానందం ,పద్మ, స్వప్న ,శ్రీలత ,సౌమ్య, శ్రీనివాస్ ,గిరిధర్ , రమా సుమలత తదితరులు పాల్గొన్నారు

# వార్డు బాటలో మేయర్ మహంకాళి స్వామి

**ముంపు సమస్యల పరిష్కారానికి చర్యలు**



**అగ్నిధార న్యూస్ ,(రామగుండం):**

ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కరించేందుకే ఎమ్మెల్యే ఆదేశాల మేరకు వార్డు బాట పట్టామని రామగుండం నగర మేయర్ మహంకాళి స్వామి తెలిపారు. శనివారం 2వ డివిజన్‌లోని జంఘాలపల్లి, న్యూ పోరట్‌పల్లి తదితర ప్రాంతాల్లో స్థానిక కార్పొరేటర్ వెంగళ బాపుతో కలిసి ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ ఎన్‌టీపీసీ నాలా కారణంగా ప్రతి వర్షాకాలంలో ఈ ప్రాంతం ముంపుకు గురవుతోందన్నారు. దశాబ్దాలుగా నాలాలో పూడిక తొలగించకపోవడంతో చిన్న వర్షానికే ఇళ్లలోకి నీరు చేరుతోందన్నారు. సమస్యపై ఎన్‌టీపీసీ అధికారులతో మాట్లాడగా, పూడిక తొలగింపునకు అంగీకరించారని, త్వరలో పనులు ప్రారంభమవుతాయని తెలిపారు. ఈసారి వరద ప్రభావం లేకుండా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఎన్‌టీకాలనీలో వంతెన నిర్మాణం కోసం కూడా ఎన్‌టీపీసీ అధికారులను కోరినట్లు తెలిపారు. రెండో డివిజన్‌లో కొన్ని ప్రాంతాల్లో అండర్‌గ్రౌండ్ డ్రైనేజ్ అవసరముందని గుర్తించామని, త్వరలో నిర్మాణ పనులు చేపడతామని పేర్కొన్నారు. సింగిల్ ఫేజ్ విద్యుత్ సరఫరాతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని స్థానికులు తెలిపారని, వెంటనే త్రీ ఫేజ్ సరఫరా కోసం ఎన్‌పీడీసీఎల్ అధికారులకు ఆదేశాలు జారీ చేశామని అన్నారు. ప్రమాదకరంగా వేలాడుతున్న విద్యుత్ తీగలను సరిచేయడంతో పాటు మిడిల్ పోల్స్ ఏర్పాటు చేస్తామని చెప్పారు. వంగిపోయిన, శిథిలావస్థకు చేరిన స్తంభాలను తొలగించాలని సూచించినట్లు తెలిపారు. పైప్‌లైన్లు ఉన్నప్పటికీ కొందరు నల్లా కనెక్షన్లకు దరఖాస్తు చేయలేదని గమనించామని, మున్సిపల్ సిబ్బంది ద్వారా అవగాహన కల్పించి కనెక్షన్లు ఇప్పిస్తామని చెప్పారు. నగరాన్ని పరిశుభ్రంగా, సుందరంగా తీర్చిదిద్దేందుకు ప్రజలు కాలువలు, రోడ్లపై చెత్త వేయకుండా సహకరించాలని కోరారు. ఆక్రమణలు చేయవద్దని సూచించారు.ఉమేయర్ ఆదేశాల మేరకు మెప్మా, అంగన్‌వాడీ సిబ్బంది ఇంటింటికి తిరిగి ప్రజలకు అవగాహన కల్పించారు. పలు వీధుల్లో రోడ్లకు అడ్డంగా పెరిగిన పిచ్చి చెట్లు, కొమ్మలను మేయర్ సమక్షంలో తొలగించి ట్రాక్టర్ల ద్వారా తరలించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ మెరుగు భూలక్ష్మి, ఎస్ఈ గురువీర, ఈఈ పీవీ రామన్, టీపీఎస్ నవీన్, డీఈఈ జగదీష్, షాభాజ్, ఏఈ జమీల్, సానిటరీ ఇన్‌స్పెక్టర్ నాగభూషణం, నాయకులు దాసరి విజయ్, వెంగళ పద్మలత, మెప్మా ఆర్పీలు తదితరులు పాల్గొన్నారు.

# నేటి నుంచి స్వీయ జనగణన ప్రారంభం

**మే 10 వరకు ఆన్‌లైన్‌లో నమోదు అవకాశం**

**అగ్నిధార న్యూస్ ,(రామగుండం);**

జనగణన--2027లో భాగంగా ఆదివారం నుంచి స్వీయ గణన కార్యక్రమం ప్రారంభమవుతుందని అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు), రామగుండం నగర పాలక సంస్థ కమిషనర్ జె. అరుణశ్రీ తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఉదయం 9 గంటలకు నగర పాలక సంస్థ కార్యాలయంలో ప్రారంభ కార్యక్రమం నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ప్రజలు తమ కుటుంబ వివరాలను తామే ఆన్‌లైన్‌లో నమోదు చేసుకునే సౌకర్యం ఏప్రిల్ 26 నుంచి మే 10 వరకు అందుబాటులో ఉంటుందని తెలిపారు. ఇందుకోసం https://se.census.gov.in?? లింక్ ద్వారా స్వీయ గణన ప్రక్రియను పూర్తి చేసుకోవచ్చన్నారు. ముందుగా సెల్ఫ్ ఎన్యూమరేషన్ (హెచ్ఎల్‌వో) లాగిన్‌లో తెలంగాణను ఎంపిక చేసి, క్యాప్చా నమోదు చేసి వెరిఫై ప్రొసీడ్‌పై క్లిక్ చేయాలని సూచించారు. అనంతరం వెల్‌కమ్ పేజీలో కుటుంబ పెద్ద పేరు, మొబైల్ నంబర్ నమోదు చేయాలని తెలిపారు. వచ్చిన ఓటీపీ నమోదు చేసి మళ్లీ వెరిఫై ఉ ప్రొసీడ్ క్లిక్ చేయాలన్నారు. తర్వాత అవసరమైన భాషను ఎంపిక చేసి జిల్లా, పట్టణం, పిన్‌కోడ్ వివరాలు నమోదు చేయాలని చెప్పారు. మొబైల్‌లో లొకేషన్ ఆన్ చేసి, ఇంటి వద్ద రెడ్ మార్క్ సెట్ చేయాలన్నారు. ఇళ్ల వివరాలకు సంబంధించిన 33 ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చి, ప్రివ్యూ ద్వారా పరిశీలించి సబ్మిట్ చేసిన తర్వాత హెచ్‌తో ప్రారంభమయ్యే 11 అంకెల సెల్ఫ్ ఎన్యూమరేషన్ ఐడీ నంబర్ వస్తుందని తెలిపారు. ఆ నంబర్‌ను స్క్రీన్‌షాట్ తీసుకుని లేదా నమోదు చేసుకుని భద్రపరచాలని, గణనాధికారి ఇంటికి వచ్చినప్పుడు చూపిస్తే వారు ఆమోదిస్తారని చెప్పారు. ఒక కుటుంబానికి ఒకే మొబైల్ నంబర్ ఉపయోగించాలని సూచించారు. స్వీయ గణన ద్వారా సమయం ఆదా అవుతుందని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# ఆర్టీసీ కార్మికుల పోరాటం ఘనవిజయం

**ఐఎఫ్‌టీయూ**

**అగ్నిధార న్యూస్ ,( రామగుండం )**

సమ్మెలో పాల్గొన్న ఆర్టీసీ కార్మికులకు ఐఎఫ్‌టీయూ (భారత కార్మిక సంఘాల సమాఖ్య) రాష్ట్ర కమిటీ అభినందనలు తెలిపింది. అమరుడు కోలా శంకర్ గౌడ్‌కు జోహార్లు అర్పించింది.ఈ మేరకు ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు కే విశ్వనాథ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్. రెల్లి కృష్ణ శనివారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. గత కొన్ని సంవత్సరాలుగా ఆర్టీసీ కార్మికులు తమ సమస్యల పరిష్కారం కోసం పోరాడుతున్నారని పేర్కొన్నారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడం, ఉద్యోగులను ప్రభుత్వ సిబ్బందిగా గుర్తించడం, వేతన సవరణలు అమలు చేయడం, కార్మిక సంఘాల గుర్తింపు ఎన్నికలు నిర్వహించడం, ఆస్తుల ప్రైవేటీకరణను అడ్డుకోవడం, మహిళా కార్మికులకు సౌకర్యాలు కల్పించడం తదితర 32 డిమాండ్లను ప్రభుత్వం ముందు ఉంచారని తెలిపారు.గత ప్రభుత్వాలు, ప్రస్తుత ప్రభుత్వం ఎన్నికల సమయంలో హామీలు ఇచ్చినా అమలు చేయలేదని విమర్శించారు. కార్మికుల సమస్యలపై నిర్లక్ష్య ధోరణి కారణంగానే సమ్మెకు దారి తీసిందన్నారు. నర్సంపేటకు చెందిన కోలా శంకర్ గౌడ్ ఆత్మాహుతి చేసుకోవడం బాధాకరమని పేర్కొన్నారు. ఆయన త్యాగం రాష్ట్రవ్యాప్తంగా కార్మికుల్లో ఐక్యతను పెంపొందించిందన్నారు. సమ్మె తీవ్రత నేపథ్యంలో ప్రభుత్వం మంత్రులతో ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేసి, గుర్తింపు యూనియన్ల నాయకులతో చర్చలు జరిపిందని తెలిపారు.కార్మికులు ఉంచిన 32 డిమాండ్లపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించిందని, ఇది ఆర్టీసీ కార్మికుల పోరాట విజయమని ఐఎఫ్‌టీయూ పేర్కొంది.

# సాగర్ రంజన్ సాహూకు ఘన సత్కారం



**అగ్నిధార న్యూస్ ,(రామగుండం)**

ఎన్‌టీపీసీ సంస్థ హెచ్‌ఆర్ హెడ్ ఆఫ్ ది డిపార్ట్‌మెంట్‌గా విధులు నిర్వహిస్తున్న సాగర్ రంజన్ సాహూను బీజేపీ నాయకురాలు కందుల సంధ్యారాణి శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సత్కరించారు. ఆయన కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో పుష్పగుచ్ఛం అందజేసి, శాలువాతో సన్మానించారు.ఈ సందర్భంగా సంస్థ అభివృద్ధి, ఉద్యోగుల సంక్షేమం, భవిష్యత్ కార్యాచరణపై ఆత్మీయంగా చర్చలు జరిగినట్లు తెలిసింది. సాగర్ రంజన్ సాహూ సేవలను పలువురు ప్రశంసించారు. ఆయన నాయకత్వంలో సంస్థ మరింత పురోగతి సాధించాలని ఆకాంక్షించారు.కార్యక్రమం ముగింపులో పరస్పరం శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సత్కారం స్థానికంగా ప్రాధాన్యత సంతరించుకుంది.ఈ కార్యక్రమంలో బీఎంఎస్ నాయకులు సాగర్ రాజు, సత్యనారాయణ రెడ్డి, బాలయ్య, బీజేపీ నాయకులు జక్కుల పద్మ, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు

# ఆర్టీసీ డ్రైవర్ మృతికి సింగరేణి కార్మికుల నివాళి



**అగ్నిధార న్యూస్, (రామగుండం) :**

ఆర్టీసీ డ్రైవర్ శంకర్ గౌడ్ మృతికి సంతాప సూచకంగా సింగరేణి ఆర్జీ-1 ఏరియాలోని గనులు, విభాగాలు, ఓసీపీ-5లో కార్మికులు శనివారం ఒక నిమిషం మౌనం పాటించి నివాళులర్పించారు.గుర్తింపు సంఘం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఏఐటీయూసీ ఆర్జీ-1 బ్రాంచి కార్యదర్శి రంగు శ్రీను మాట్లాడుతూ, ఆర్టీసీ కార్మికుల సమ్మె నేపథ్యంలో నర్సంపేట డిపోకు చెందిన డ్రైవర్ శంకర్ గౌడ్ ఆత్మహత్యకు పాల్పడి మృతి చెందడం బాధాకరమన్నారు. సమ్మె నోటీసు ఇచ్చినప్పటికీ ప్రభుత్వం ముందస్తుగా చర్చలు జరిపి సమస్యలు పరిష్కరించకుండా నిర్లక్ష్యం చేయడం వల్లే ఈ ఘటన జరిగిందని ఆరోపించారు. ఆర్టీసీ అభివృద్ధి కోసం కార్మికులు శ్రమిస్తున్నప్పటికీ వారి సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం, యాజమాన్యం విఫలమయ్యాయని విమర్శించారు. శంకర్ గౌడ్ కుటుంబానికి తక్షణ న్యాయం చేసి, ఆర్థిక సహాయం అందించాలని డిమాండ్ చేశారు.జీడీకే-2ఏ ఇంక్లైన్‌లో జరిగిన కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు సంకె అశోక్, బోగ సతీష్ బాబు, మానాల శ్రీనివాస్, పొన్నాల వెంకటయ్య, కారంపూరి వెంకన్న, చంద తిరుపతి, భక్తి శ్రీనివాస్, అటికేటి రాజు, బొల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# రేషన్ షాప్ సీజ్.. డీలర్ పై చర్యలు





**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)**

తలకొండపల్లి మండలంలోని జూలపల్లి గ్రామంలో అక్రమ రేషన్ రవాణాకు అడ్డుకట్ట వేసిన గ్రామస్తులు రేషన్ డీలర్ షిప్‌ను రద్దు చేసి, స్థానిక నిరుద్యోగ యువతకు అవకాశం కల్పించాలని కోరుతున్న గ్రామస్థులు ఆర్ ఐ శ్రవణ్ కుమార్, జీపీవో నర్సింహా 21.50 క్వింటల రేషన్ బియ్యం పట్టుకొని డీలర్ వసంత పై 6ఏ కేసు నమోదు చేసి రేషన్ షాప్ ని సీజ్ చేయడం జరిగింది చాలా కాలంగా జరుగుతున్న ఈ అక్రమ రవాణాకు చెక్ పడటంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు సదరు రేషన్ డీలర్ లైసెన్స్‌ను వెంటనే రద్దు చేయాలని, ఆ స్థానంలో గ్రామంలోని నిరుద్యోగ యువతకు రేషన్ డీలర్‌షిప్ ఇచ్చి ఉపాధి కల్పించాలని , గ్రామస్తులు అధికారులను కోరారు..

# ఎన్యూమరేటర్స్ అలాట్మెంట్ లో అవకతవకలు




**అగ్నిధార న్యూస్ మహమ్మదాబాద్/గండీడ్,**

గండీడ్ మండల్ ఎమ్మార్వోకి మెమోరండం అందజేసిన ఉపాధ్యాయ సంఘాల నాయకులు సెన్సస్ (జనాభా లెక్కలు) 2027 సంవత్సరంలో భాగంగా సూపర్వైజర్స్ ఎన్యుమరేటర్స్ అలాట్మెంట్ హెచ్ ఎల్ బి హౌస్ లిస్టింగ్ బ్లాక్ ఏటువంటి ప్రామాణికత లేకుండా ఒక దగ్గర సీనియారిటీ ఒక దగ్గర వర్కింగ్ ప్లేస్ ఒక్కొక్క దగ్గర ఒక్క విధంగా అలాట్మెంట్ చేశారు. ఇది ఆశాస్త్రీయం కాబట్టి గ్రామపంచాయతీ యూనిట్గా తీసుకొని ఎన్యూమరేటర్స్ ను వర్కింగ్ ప్లేస్ లో సీనియర్ ప్రకారంగా అలాట్మెంట్ చేయాలని కోరుతున్నాము. సీనియర్లను పక్కకు పెట్టి జూనియర్లకు అలాట్మెంట్ చేయడం ఎంతవరకు సమంజసమని ఉపాధ్యాయ సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు. ప్రస్తుతం ఉన్నటువంటి అవకతవక అలాట్మెంట్లను రద్దుచేసి మళ్లీ కొత్తగా అలాట్మెంట్ చేయాలని లేని పక్షంలో ఎమ్మార్వో ఆఫీస్ ముట్టడిస్తామని ఒక ప్రకటనలో మాట్లాడారు. కార్యక్రమంలో

పిఆర్ టి యు టి ఎస్,టి ఎస్ యుటి ఎఫ్, టి పియుఎస్, పిఆర్ టియు తెలంగాణ టి ఎస్ సిపి ఎస్ ఈయు నాయకులు మరియు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# నిరుద్యోగ యువత ఉద్యోగ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి

**ఐక్యత సహకారంతో ఎస్సై కానిస్టేబుల్ ఉచిత శిక్షణ తరగతులు శిక్షణ కేంద్రం ప్రారంభించిన సుంకిరెడ్డి రాఘువేందర్ రెడ్డి ఎస్ఐ రాఘువేందర్**

అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)

మాడుగుల మండల కేంద్రంలో ప్రారంభమైన ఐక్యత ఉచిత ఎస్ఐ కానిస్టేబుల్ శిక్షణ కేంద్రం ముఖ్య అతిథులుగా ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు ఒ టాస్క్ సి ఓ ఓ సుంకిరెడ్డి రాఘువేందర్ రెడ్డి మరియు మాడుగుల ఎస్సై రాఘువేందర్ హాజరై శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి సుంకిరెడ్డి రాఘువేందర్ రెడ్డి మాట్లాడుతూ, గ్రామీణ యువతకు అవకాశాలు లేక కాదు అవకాశాలను అందిపుచ్చుకునే వేదికలు లేక వెనుకబడుతున్నారని,ఆ లోటును పూడ్చడానికే అందరికి అందుబాటులో ఉచిత శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని,ప్రతి నిరుపేద విద్యార్థి ఈ శిక్షణ వనరులను వినియోగించుకొని ఉద్యోగాన్ని సాధించే స్థాయికి మిమ్మల్ని మీరు తీర్చిదిద్దుకోండి,కష్టపడితే పోలీస్ ఉద్యోగం మీ అందరిదీ అవుతుంది,పేదరికం,గ్రామీణ నేపథ్యం మన లక్ష్యానికి అడ్డంకి కాకూడదు,ఈ గ్రామీణ ప్రాంతాల్లో ఏర్పాటు చేస్తున్న శిక్షణ కేంద్రాల నుండి పెద్ద ఎత్తున భవిష్యత్ ఎస్సైలు, కానిస్టేబుళ్లు తయారవ్వాలి,అదే మా లక్ష్యం అని,అందుకు అవసరమైన వనరులను సమకూర్చేందుకు తన వంతు ప్రయత్నం చేస్తానని ఈ సందర్భంగా తెలియజేశారు..అనంతరం ఎస్సై రాఘువేందర్ మాట్లాడుతూ గ్రామీణ నిరుద్యోగ యువత కోసం సుంకిరెడ్డి చేపడుతున్న సేవలు అభినందనీయమని,యువత భవిష్యత్తు కోసం ఉచితంగా శిక్షణ అందించడం గొప్ప సామాజిక బాధ్యత అని అన్నారు,క్రమశిక్షణ, అంకితభావం, కఠోర సాధనతో విద్యార్థులు లక్ష్యాన్ని చేరుకోవాలని సూచించారు,పోలీస్ నియామకాలలో విజయం సాధించాలంటే కేవలం చదువు సరిపోదని, మానసిక దృఢత్వం, శారీరక ఫిట్‌నెస్, క్రమశిక్షణ కూడా సమానంగా అవసరమని విద్యార్థులకు సూచించారు.

సరైన వనరులు లేక ఆర్థిక పరిస్థితులు సహకరించక వెనకబడిపోతున్న గ్రామీణ యువతకు గొప్ప చేయుతనిస్తూ ఉచిత శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్న సుంకిరెడ్డి రాఘువేందర్ రెడ్డి కృషికి గుర్తింపుగా ఈ శిక్షణ కేంద్రం నుంచి పెద్ద ఎత్తున యువత భవిష్యత్ పోలీస్ అధికారులుగా రావాలని తెలుపుతూ,విద్యార్థుల అందరి తరుపున సుంకిరెడ్డి గారికి ధన్యవాదాలు తెలియజేస్తున్నాని పేర్కొన్నారు,

శిక్షణ కేంద్రంలో చేరిన విద్యార్థులు మాట్లాడుతూఇలాంటి ఉచిత శిక్షణ కేంద్రం ఏర్పాటు కావడం తమకు ఎంతో ఆత్మవిశ్వాసాన్ని ఇచ్చిందని, సుంకిరెడ్డి రాఘువేశీదర్ రెడ్డి అందిస్తున్న ప్రోత్సాహం తమలో కొత్త ఉత్సాహాన్ని నింపిందని,ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఉద్యోగం సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు, సుంకిరెడ్డి కి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు ఈ కార్యక్రమంలో





సర్పంచ్ లు రజితదేవయ్య ,శ్రీను నాయక్,ఉప సర్పంచ్ లు సూదిని శరత్ రెడ్డి,రాజేందర్ నాయక్, ఫౌండేషన్ మండల ఇంచార్జి సూదిని జైపాల్ ,సీనియర్ నాయకులు సూదిని చంద్ర రెడ్డి,చిక్కుడు జంగయ్య,ఫౌండేషన్ సభ్యులు నాగిళ్ళ శివ,సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

# ఆంజనేయ స్వామి అనుగ్రహం ప్రతి ఒక్కరి పై ఉండాలి





**ప్రత్యేక పూజలు చేసిన ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘువేందర్ రెడ్డి**

అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)

ఆమనగల్ మున్సిపాలిటీ పరిధిలోని విఠాయిపల్లి హనుమాన్ దేవాలయాన్ని సందర్శించిన ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు టాస్క్ సి ఓ ఓ సుంకిరెడ్డి రాఘువేందర్ రెడ్డి ఆలయంలో నిర్వాహకులు ఏర్పాటు చేసిన ప్రత్యేక పూజా కార్యక్రమంలో పాల్గొని స్వామివారి దర్శనం చేసుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు,అనంతరం ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘువేందర్ రెడ్డి మాట్లాడుతూ.ఆంజనేయ స్వామి ఆశీస్సులతో నియోజకవర్గ ప్రజలందరూ సుఖశాంతులతో ఉండాలని,ఆధ్యాత్మికత మనిషికి ధైర్యాన్ని, సేవాభావాన్ని పెంపొందిస్తుందని, సమాజంలో సానుకూల మార్పులకు దైవభక్తి ఎంతో దోహదపడుతుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో

ఆలయ భావోజి లక్ష్మణ్ నాయక్,దస్థానిక నాయకులురచ్చ శ్రీరాములు,రూపం వెంకట్ రెడ్డి, శేఖర్,వెంకటేష్,గాజుల శ్రీను లతో పాటు ఐక్యత ఫౌండేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.ం

# ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు

**కడ్తల్ పట్టణంలో జాబ్ మేళా నిర్వహించిన సుంకిరెడ్డి రాఘువేందర్ రెడ్డి**

అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)

కడ్తల్ పట్టణ కేంద్రంలో ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జాబ్ డ్రైవ్ కార్యక్రమంలో ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు టాస్క్ సి ఓ ఓ సుంకిరెడ్డి రాఘువేందర్ రెడ్డి ఈ సందర్భంగా పట్టణంలో నిర్వహించిన ఈ జాబ్ డ్రైవ్‌లోప్రముఖ ఎలక్ట్రానిక్స్ సంస్థ రేడియంట్ 1 వారు పాల్గొని ఇంటర్వ్యూస్ ప్రక్రియ నిర్వహించగా 42 మంది నిరుద్యోగులు విజయవంతంగా ఇంటర్వ్యూ ప్రక్రియ పూర్తి చేసి త్వరలోనే ఉద్యోగంలో చేరడం జరుగుతుంది.అనంతరం సుంకిరెడ్డి రాఘువేందర్ రెడ్డి మాట్లాడుతూ, నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలను అందుబాటులోకి తీసుకురావడం,ప్రైవేట్ రంగ సంస్థలతో అనుసంధానం కల్పించడం,యువతలో ఉపాధి పట్ల నమ్మకం పెంపొందించడం లక్ష్యంగా ఈ జాబ్ డ్రైవ్‌లు నిర్వహిస్తున్నామని, ముఖ్యంగా యువతకు కేవలం ఉద్యోగాలపై అవగాహన కల్పించడం మాత్రమే కాకుండా,ఉద్యోగ అవకాశాలను నేరుగా వారి ముందుకు తీసుకురావాలనే ఉద్దేశంతో ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఇలాంటి జాబ్ డ్రైవ్‌లు,ఉచిత శిక్షణా కార్యక్రమాలు చేపడుతున్నామని,



నిరుద్యోగ సమస్య పరిష్కారం కోసం ఒకవైపు ఉచిత ఎస్ఐ ఒ కానిస్టేబుల్ శిక్షణ కేంద్రాలు నిర్వహిస్తూ,మరోవైపు ప్రైవేట్ రంగ ఉద్యోగ అవకాశాల కోసం జాబ్ డ్రైవ్‌లు ఏర్పాటు చేయడం ద్వారా యువతకు రెండు విధాలుగా అండగా నిలుస్తున్నామని పేర్కొన్నారు,ప్రస్తుతం ఉద్యోగాల కోసం యువత ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని,పలు ఎలక్ట్రానిక్ కంపెనీ ప్రతినిధులతో పలు దఫాలుగా చర్చలు జరిపి నిరుధ్యోగ యువతకు అండగా ఉండేందుకు తన వంతు ప్రయత్నంగా పలు జాబ్ మేళా కార్యక్రమాలు నిర్వహిస్తూ ముందుకు సాగుతున్నాం అని, 42 మంది నిరుద్యోగులకు ఇంటర్వ్యూల ప్రక్రియ విజయవంతంగా పూర్తి చేసుకొన్నారని, జాయినింగ్ ప్రక్రియ త్వరలో పూర్తి అవుతుందని, భవిష్యత్తులో మరిన్ని మండలాల్లో ఇలాంటి జాబ్ డ్రైవ్‌లు నిర్వహిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో రేడియంట్ 1 సంస్థ ప్రతినిధుల బృందంతో పాటు ఐక్యత ఫౌండేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# నిబంధనలు పాటించని కాలేజీల గుర్తింపు రద్దు చేయాలి



**పి.డి.ఎస్.యు.రాష్ట్ర ఉపాధ్యక్షులు బి.నరసింహరావు.**
**హన్మకొండ డిఐఈఓ కు పి.డి.ఎస్.యు.వినతి.**

అగ్నిధారన్యూస్ హన్మకొండ

ప్రభుత్వ నియమ నిబంధనలకు విరుద్ధంగా కొనసాగుతున్న ప్రైవేట్ కార్పొరేట్ జూనియర్ కాలేజీల గుర్తింపును వెంటనే రద్దు చేయాలని పి.డి.ఎస్.యు. తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షులు బి.నరసింహారావు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పి.డి.ఎస్.యు) ఆధ్వర్యంలో హన్మకొండ లోని జిల్లా ఇంటర్మీడియట్ విద్యా శాఖ అధికారి (డిఐఈఓ) కార్యాలయం లో సీనియర్ అసిస్టెంట్ హరితకి డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని ప్రతినిధి బృందంగా ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా బి.నరసింహా రావు మాట్లాడుతూ ఇటీవల పదవ తరగతి పూర్తి చేసిన గ్రామీణ ప్రాంత విద్యార్థి తల్లిదండ్రుల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకొని పదవ తరగతి ఫలితాలు వెలువడక ముందే ప్రైవేట్, కార్పొరేట్ జూనియర్ కళాశాలల యాజమాన్యాలు చేపడుతున్న ముందస్తు అడ్మిషన్ల ను అరికట్టడంలో సంబంధిత ఇంటర్ విద్యాశాఖ అధికారులు ,రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒక్క కాలేజీ పేరిట పర్మిషన్ తీసుకొని 4 నుంచి 10 కి పైగా అదనపు బ్రాంచ్ లు ఎలాంటి అనుమతులు లేకుండా నెలకొల్పుకుంటూ ప్రభుత్వాన్ని ,విద్యార్థుల తల్లిదండ్రులను మోసం చేస్తున్నారని మండిపడ్డారు. ప్రైవేట్ ,కార్పొరేట్ కాలేజీల యాజమాన్యాలు విద్యార్థులను అడ్మిషన్ చేయించుకునే ముందు ఎలాంటి అదనపు ఫీజులు తీసుకోమని, ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండానే రెసిడెన్షియల్ హాస్టల్స్ నిర్వహిస్తూ అనేక అబద్ధాలతో కూడిన మోసపూరిత మాయమాటలు చెప్పి తీరా అడ్మిషన్ చేయించుకున్న తర్వాత అడ్మిషన్ ఫీజు ,ల్యాబ్, లైబ్రరీ, కంప్యూటర్, పరీక్ష, ప్రాక్టికల్, వెల్కమ్ ఫేర్వెల్ పార్టీ, మెటీరియల్, ఐఐటి జేఈఈ మెయిన్స్, నీట్ కోచింగ్ అంటూ విద్యార్థులను ఫీజుల పేరిట పీల్చి పిప్పి చేస్తూ లక్షలాది రూపాయలు అక్రమంగా దోచుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సంబంధిత ఇంటర్ విద్యాశాఖ అధికారులు, రాష్ట్ర ప్రభుత్వం స్పందించి ముందస్తు అడ్మిషన్ లు చేపడుతున్న ప్రైవేట్ కార్పొరేట్ కాలేజీలపై కఠిన చర్యలు తీసుకోవాలని, పర్మిషన్ లేకుండా అదనపు బ్రాంచ్ లను నిర్వహిస్తున్న ప్రైవేట్ కాలేజీల యాజమాన్యాలపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని, ప్రభుత్వ నియమ, నిబంధనలకు విరుద్ధంగా కొనసాగుతున్న ప్రైవేట్ కాలేజీల గుర్తింపుని తక్షణమే రద్దు చేయాలని, అనుమతి లేకుండా అపార్ట్మెంట్లలో కొనసాగుతున్న కాలేజీలను, వాటికి అనుబంధంగా నిర్వహిస్తున్న రెసిడెన్షియల్ హాస్టల్స్ ను వెంటనే సీజ్ చేయాలని, ప్రైవేట్ కాలేజీల్లో అధిక ఫీజులను నియంత్రిస్తూ సమగ్ర చట్టం రూపొందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేకపోతే పి.డి.ఎస్.యు. ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పి.డి.ఎస్.యు. వరంగల్-హన్మకొండ జిల్లా అధ్యక్షులు బోయినపల్లి అజయ్, రాష్ట్ర గర్ల్స్ కన్వీనర్ వి. కావ్య, కో- కన్వీనర్ పి. అనూష, జిల్లా సహాయ కార్యదర్శి గణేష్, స్వాతి, సద్దాం తదితరులు పాల్గొన్నారు.

# ఐ ఎల్ పి ఎ నేషనల్ ప్రెసిడెంట్ గా సుజాత చౌదంటే



**ఐ ఎల్ పి ఎ నేషనల్ వర్కింగ్ ప్రెసిడెంట్ గా ఎన్ జె శాంసన్**
**నేషనల్ కమిటీలో తెలుగు రాష్ట్రాలకు ప్రాధాన్యత**
**నాగపూర్ లో జరిగిన సదస్సులో నేషనల్ కమిటీ ఎన్నిక..**

అగ్నిధారన్యూస్ మహారాష్ట్ర

ఇండియన్ లీగల్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ నేషనల్ ప్రెసిడెంట్ గా నాసిక్ కు చెందిన సీనియర్ న్యాయవాది సుజాత చౌదంటే ఎన్నికయ్యారు. శనివారం మహారాష్ట్ర నాగపూర్ పట్టణంలో జరిగిన జాతీయ స్థాయి సమావేశంలో వివిధ రాష్ట్రాలకు చెందిన ఇండియన్ లీగల్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ న్యాయవాదులు హాజరై నేషనల్ కమిటీని ఎన్నుకున్నారు. పూలే, అంబేద్కర్ సిద్ధాంతంతో సామాజిక న్యాయం ఎజెండాగా బాంసెఫ్ కు అనుబంధ విభాగంగా కొనసాగుతున్న ఐ ఎల్ పి ఎ నేషనల్ ప్రెసిడెంట్ గా మహిళను ఎన్నుకొని తన సిద్ధాంతాన్ని ఆచరణాత్మకంగా నిలబెట్టారు. గత 10 సంవత్సరాలుగా న్యాయవాద సంఘంలో కీలక బాధ్యతలు నిర్వహిస్తున్న తెలంగాణ రాష్ట్ర ఐ ఎల్ పి ఎ అధ్యక్షుడు ఎన్ జె శాంసన్ ను నేషనల్ వర్కింగ్ ప్రెసిడెంట్ గా ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా కర్ణాటకకు చెందిన ప్రవీణ్ కుమార్ తల్వార్, ఉపాధ్యక్షులుగా సునీల్ డోంగర్ దివే, జాయింట్ సెక్రటరీగా ఉత్తరప్రదేశ్ కు చెందిన యాకుబ్ సిద్ధికి, కోశాధికారిగా గుజరాత్ రాష్ట్రానికి చెందిన విజయ్ డేనియల్, కార్యనిర్వాహక సభ్యులుగా నూకతోట రవికుమార్ (ఆంధ్రప్రదేశ్), బ్రిజేష్ జైశ్వార్ (మహారాష్ట్ర), డి ఆర్ వాగ్మోర్ (మహారాష్ట్ర), తెలంగాణ రాష్ట్రం కొత్తగూడెం కు చెందిన సుంకర భానుప్రియ లను ఎన్నుకున్నారు.నూతనంగా ఎన్నుకోబడిన జాతీయ అధ్యక్షులు సుజాత చౌదంటే, నేషనల్ వర్కింగ్ ప్రెసిడెంట్ లు మాట్లాడుతూ ప్రపంచంలో అత్యంత పెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారత దేశంలో ప్రజలకు మెజార్టీ ప్రజలకు ప్రజాస్వామ్యం, రాజ్యాంగ హక్కులు తెలియక బానిసత్వంలో జీవిస్తున్నారని, సమాజంలో ఉన్నత విద్యావంతులైన న్యాయవాదులు ప్రజలను చైతన్యం చేయడంలో ముందుకు వచ్చినప్పుడే సమసమాజం ఏర్పడుతుందని అన్నారు. తెలంగాణ రాష్ట్ర ఐ ఎల్ పి ఎ పనితీరు దేశానికి ఆదర్శంగా తీసుకొని పనిచేయాలని, ఒబిసి న్యాయవాదుల రాష్ట్ర సదస్సు నిర్వహించి రాష్ట్రంలో బి.సి జనగణన సాధించామని, దేశంలోనే మొదటగా మహిళా న్యాయవాదుల రాష్ట్ర సదస్సు నిర్వహించి న్యాయవాద రక్షణ చట్టం డిమాండ్ చేసి సాధించడంలో ఐ ఎల్ పి ఎ కీలకపాత్ర పోషించిందని అన్నారు. నూతనంగా న్యాయవాద వృత్తిలోకి వచ్చిన వారికి గత 10 సంవత్సరాలుగా ఉచిత శిక్షణిస్తూ ఎంతోమంది పబ్లిక్ ప్రాసిక్యూటర్ లుగా, జడ్జీలుగా నియామకమవడానికి కృషి చేశామని, న్యాయవాదులు వృత్తిలో నిలదొక్కుకుని అభివృద్ధి చెందడం కోసం కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఐ ఎల్ పి ఎ కార్యక్రమాలను దేశ వ్యాప్తంగా విస్తరించి బహుజన వర్గాలకు అండగా నిలిచి దేశంలో సామాజిక న్యాయం సాధించడానికి త్యాగపూరిత ఉద్యమాలు చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ఐ ఎల్ పి ఎ ప్రధాన కార్యదర్శి సాయిని నరేందర్, ఉపాధ్యక్షులు కందుకాల సురేష్, వివిధ రాష్ట్రాలకు చెందిన ఐ ఎల్ పి ఎ నాయకులు యోగేంద్ర యోగి, ధర్మేష్ సహారి, స్మిత తక్సాండే, పూనమ్, హర్షలి చౌబే, విశ్వరూప తదితరులు హాజరయ్యారు.

# వరి కొనుగోలు కేంద్రాలలో మద్దతు ధర పొందండి... దళారులను నమ్మి మోసపోకండి

**రైతులను ఇబ్బందులకు గురిచేయుద్దు..**
**వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన ఎంపీ మల్లురవి, ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి**

**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)**



రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని రైతుకు గిట్టుబాటు ధర కల్పించడం కోసం రాష్ట్ర ప్రభుత్వం సింగల్ విండోల ద్వారా వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసిందని వాటిని సద్వినియోగపరుచుకోవాలని నాగర్ కర్నూల్ ఎంపీ డాక్టర్ మల్లురవి, ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, డిసిసిబి డైరెక్టర్, ఆమనగల్లు సింగల్ విండో చైర్మన్ గంప వెంకటేష్ గుప్తా అన్నారు. శనివారం ఆమనగల్లు పట్టణంలోని మార్కెట్ యార్డ్ ఆవరణలో సింగల్ విండో ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని చైర్మన్ గంప వెంకటేష్ గుప్తా తో కలిసి ఎంపీ మల్లు రవి, ఎమ్మెల్యే నారాయణరెడ్డి ఆమనగల్ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ యాట గీత నరసింహ, వైస్ చైర్మన్ గూడూరు భాస్కర్ రెడ్డి,సింగల్ విండో వైస్ చైర్మన్ సత్యం, మార్కెట్ కమిటీ, సింగల్ విండో డైరెక్టర్లు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వరి ధాన్యానికి ప్రభుత్వం క్వింటాలుకు మద్దతు ధర రూ. సన్నాళ్లకు రూ. 2389 పైసలు దొడ్డు రకం కింటాలుకు రూ. 2369 ఇవ్వడం జరుగుతుందన్నారు. కొనుగోలు చేసిన వరి ధాన్యాన్ని వెంటనే రైస్ మిల్లులకు తరలించడం జరుగుతుందని రైతులు తేమశాతం వచ్చే విధంగా చూసుకోవాలని తేమశాతం ఉంటేనే గిట్టుబాటు ధరలభ్యమవుతుందని తెలిపారు. వరి ధాన్యం తీసుకువచ్చే రైతుల కోసం అన్ని రకాల ఏర్పాటు చేయడం జరిగిందని రైతులు ఎవరు ఇబ్బందులకు గురి కాకుండా అధికారులు ఎప్పటికప్పుడు చర్యలు చేపట్టాలని ఆయన కోరారు. వరికి గిట్టుబాటు ధరతో పాటు సన్న రకం వరి ధాన్యానికి రూ. 500 బోనస్ కూడా ప్రభుత్వం చెల్లించడం జరుగుతుందన్నారు. ధాన్యం కొనుగోలు చేసిన రెండు రోజుల్లోనే రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేయడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగపరుచుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో ఆమనగల్లు మున్సిపాలిటీ చైర్మన్ పత్యా నాయక్, తలకొండపల్లి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు డోకూరి ప్రభాకర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు కాసు శ్రీనివాస్ రెడ్డి, కౌన్సిలర్లు వెంకటయ్య, మహేష్, రమేష్, మార్కెట్ కమిటీ కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి, ఏఎంసి, సింగల్ విండో డైరెక్టర్లు అంజయ్య యాదయ్య, శ్రీ పాల్, టీపీసీసీ సభ్యులు ఆయిళ్ల శ్రీనివాస్ గౌడ్, కేశవులు, నిట్ట నారాయణ, మెకానిక్ బాబా, జగన్, జంగయ్య, రాములు, మానయ్య, సింగల్ విండో సీఈవో దేవేందర్, సిబ్బంది పద్మాకర్ రెడ్డి అల్లాజీ, మహేష్, శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.

# అన్నదాతకు ప్రభుత్వం అండ....





**కాంగ్రెస్ సర్కార్ రైతు పక్షపాతి..**
**రైతు సంక్షేమానికి పెద్దపీట..**
**ప్రభుత్వ విప్, పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణ రావు ..**

**అగ్నిధారన్యూస్ పెద్దపల్లి**

పెద్దపల్లి మండలం రాఘవాపూర్ అప్పన్నపేట గ్రామంలోని వడ్ల కొనుగోలు కేంద్రాలను స్థానిక నాయకులతో కలిసి ప్రభుత్వ విప్, పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణరావు ప్రాంభించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే విజయరమణ రావు మాట్లాడుతూ. రైతుల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని ఆరుగాలం శ్రమించి పంటలు పండిస్తున్న అన్నదాతలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలోని ప్రభుత్వం అండగా ఉంటుందని తెలిపారు. పదేళ్ల బిఆర్ఎస్ పాలనలో పాలకులు కోతల పేరిట రైతుల శ్రమను దోచుకున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ సర్కార్ రైతులకు అండగా ఉంటూ రైతులకు కొనుగోళ్ల విషయంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూసుకుంటూ రైతుల మన్నలు పోతుందని స్పష్టం చేశారు. రైతుల ప్రభుత్వం సూచించిన విధంగా ధాన్యానికి 15 శాతం తేమ వచ్చేలా చూడాలని కోరారు. వర్షం కురిసిన కూడా ఇబ్బందులు లేకుండా అన్ని రకాల చర్యలను తీసుకోవాలని అధికారులకు సూచించడం జరిగింది అలాగే వివిధ రకాల ధాన్యానికి సంబంధించిన రేట్లను సూచించే పట్టికలను ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. పెద్దపల్లి నియోజకవర్గంలోని అన్ని గ్రామాలలో వడ్ల కొనుగోలు కేంద్రాలు ప్రారంభం చేస్తున్నామని వాటిని రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కొనుగోలు కేంద్రాలలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు ఉండవని స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమంలో మునిసిపల్ చెర్మన్,వ్యవసాయ మార్కెట్ చైర్మన్, డైరెక్టర్లు, పలు గ్రామాల సర్పంచులు, ఉపసర్పంచులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, మాజీ ప్రజా ప్రతినిధులు, రైతుకు తదితరులు పాల్గొన్నారు.

# పాటగూడ పానీపాట్లు

**మిషన్ భగీరథ నీరు రాక అల్లాడుతున్న కొలాం గ్రామం**
**పైపులైన్‌కు మరమ్మతులు చేసే దిక్కు లేక తిప్పలు**
**ఇంటింటికీ నల్లాలున్నా ఫలితం శూన్యం**
**భూగర్భ జలాలు అడుగంటి పనిచేయని చేతిపంపు**
**కిలోమీటర్ దూరంలోనున్న వాగులోని బావే దిక్కు**
**అదీ కూడా ఎండిపోతే పరిస్థితి ఏమిటని అడవిబిడ్డల ఆందోళన**





**కుమ్రం భీం ఆసిఫాబాద్ :** సర్కారు నిర్లక్ష్యం ఆ కొలాం గ్రామానికి శాపంగా మారింది. కేసీఆర్ ప్రభుత్వంలో మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికీ తాగు నీరు సరఫరా కాగా, ప్రస్తుతం పైపులైన్‌కు మరమ్మతులు చేసే దిక్కు లేక ఆ ఊరి ప్రజానీకం అష్టకష్టాలు పడాల్సి వస్తున్నది. గొంతు తడుపుకు నేందుకు కిలోమీటర్ దూరంలోనున్న వ్యవసాయ బావి వద్దకు కాలినడకన వెళ్లి నీరు తెచ్చుకోవాల్సిన దుస్థితి నెలకొన్నది.

**ఆ బావి కూడా అడుగంటితే ఎలా..?**

కెరమెరి మండల కేంద్రానికి సుమారు 15 కిలోమీటర్ల దూరంలోనున్న పాటగూడలో సుమారు 50 కుటుంబాలు ఉంటాయి. ఇక్కడ ఒకే ఒక్క చేతి పంపు ఉండగా, భూగర్భ జలాలు అడుగంటి పోవడంతో అందులో నుంచి నీరు రావడం లేదు. ఇక మిషన్ భగీరథ నీరందకపోవడంతో సుమారు కిలోమీటర్ దూరంలోనున్న బావి (ఉపాధి హామీ పథకం ద్వారా ఏర్పాటు చేసినది) నుంచి గ్రామస్తులు నీటిని తెచ్చుకొని అవసరాలు తీర్చుకోవాల్సి వస్తున్నది. ఎండలు ముదురుతుండగా, మరో 15.. 20 రోజుల్లో ఆ బావి కూడా అడుగంటి పోతే తమ పరిస్థితి ఏమిటని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**మిషన్ భగీరథ పైపులైన్‌పై పట్టింపు కరువు**

కేసీఆర్ సర్కారు మిషన్ భగీరథ వాటర్ ట్యాంక్ నిర్మించి, ఇంటింటికీ నల్లాలు ఏర్పాటు చేసి నీరు సరఫరా చేసింది. కానీ, కాంగ్రెస్ సర్కారు అధికారంలోకి వచ్చాక నిర్వహణ లోపంతో పైపులైన్‌లు దెబ్బతిన్నాయి. మరమ్మతుల గురించి పట్టించుకున్న వారు లేకపోవడంతో తాగునీటి సమస్య మొదలైంది. తప్పనిసరి పరిస్థితుల్లో కిలోమీటర్ దూరంలోనున్న వ్యవసాయ బావి నుంచి తాగు నీరు తెచ్చుకోవాల్సిన దుస్థితి నెలకొన్నది. మరికొన్ని రోజుల్లో ఈ బావి కూడా ఎండిపోతుందని, ఆ పరిస్థితిని తలుచుకుంటేనే భయంగా ఉందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాకాలం, చలికాలంలో ఎలాగోలా నెట్టుకొచ్చామని, ఈ ఎండాకాలం ఎలాగని ఆందోళన చెందుతున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి తాగు నీటి గోస తీర్చాలని వారు వేడుకుంటున్నారు.

## రెండేళ్లలో మళ్లీ మన ప్రభుత్వం వస్తుంది.. రైతులతో కేటీఆర్



బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పర్యటనలో భాగంగా సిరిసిల్ల నియోజకవర్గంలో వడ్ల కొనుగోలు కేంద్రాలను సందర్శించారు. ధాన్యం రాశుల వద్ద ఆగి రైతులతో మాట్లాడి సమస్యను అడిగి తెలుసుకున్నారు. ఈ ప్రభుత్వం వడ్లు కొంటే మద్దతు ధర, బోనస్ ఇవ్వాల్సి వస్తుందని కొనటం లేదని ఈ సందర్భంగా కేటీఆర్ అన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో నెల రోజుల నుంచి కొనుగోలు కేంద్రాలకు వడ్లు తీసుకొస్తే ఇప్పటివరకు ఒక్క గింజ కొన్న పాపానపోలేదని..రైస్ మిల్ కేటాయించపోతే ఎవరు కొనాలి..? ఎలా తూకం వేయాలని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. దళారులకు అప్పగిస్తే వాళ్లు ఇంత కమిషన్ ఇస్తారు.. అందుకే కొనకుండా వదిలేశారన్నారు. . రైతుబంధు అని చెప్పి అది కూడా ఇవ్వడం లేదు. సిరిసిల్లలో అధికారులను అడిగితే 1000 క్వింటాళ్లు కూడా వడ్లు కొనలేదని అంటున్నారు. అకాల వర్షం వచ్చి ధాన్యం తడిసిపోయి పాడైపోతుందని రైతులు టార్పిలిన్ కవర్లు కొని కప్పుకుంటున్నారు. ఇంత దౌర్భాగ్యమైన ప్రభుత్వం ఎక్కడా చూడలేదని కేటీఆర్ మండిపడ్డారు. రైతుల ధాన్యం కొనుగోలు చేయాలి.. లేదంటే మేము రోడ్డెక్కుతామని కేటీఆర్ రైతులకు భరోసానిచ్చారు. రెండేళ్లలో మళ్లీ మన ప్రభుత్వం వస్తుంది.. ఆ తర్వాత రైతులను కంటికి రెప్పలా కాపాడుకుంటామని కేటీఆర్ పునరుద్ఘాటించారు.

## డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను నెలాఖరులోగా లబ్ధిదారులకు అందించాలి



**పెద్దపల్లి :** జిల్లాలోని రామగుండం మండలంలోని జంగాలపల్లిలో నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను నెలాఖరులోగా లబ్ధిదారులకు అందజేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదేశించారు. శనివారం రామగుండం మండలంలోని జంగాలపల్లిలో నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను అదనపు కలెక్టర్ అరుణశ్రీ తో కలిసి పరిశీలించి, అక్కడి మౌలిక వసతులపై అధికారులకు పలు సూచనలు చేశారు. ఇళ్ల వద్ద నీరు, విద్యుత్, రహదారులు తదితర ప్రాథమిక సదుపాయాలను త్వరితగతిన పూర్తి చేయాని, అర్హులైన లబ్ధిదారులకు ఇళ్లను అప్పగించాలని స్పష్టం చేశారు. అనంతరం రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జంగాలపల్లి, పాములపేటలో ప్లాట్లు పొందిన లబ్ధిదారులందరికీ ఇందిరమ్మ ఇళ్లను కూడా మంజూరు చేసేలా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం రామగుండం మండలంలోని న్యూ మారేడుపాకలో ఆర్ అండ్ ఆర్ కాలనీ పరిశించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో గంగయ్య, రామగుండం తహసీల్దార్ రవీందర్ రావు, తదితరులు పాల్గొన్నారు.

## అధికార పార్టీకి రెవెన్యూ అధికారులు కొమ్ముకాస్తున్నారని దళిత మహిళల ఆందోళన



**చిగురుమామిడి :** రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యం తోపాటు అధికార పార్టీకి కొమ్ముకాస్తున్న అధికారులు న్యాయం చేయడం లేదని వారి తీరుపై మహిళ రైతులు రెవెన్యూ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. మహిళా రైతులు మాట్లాడుతూ చిగురుమామిడి మండలం నవాబుపేట గ్రామానికి చెందిన బోయిని లక్ష్మీ అనే మహిళ తన వ్యవసాయ భూమి సర్వే నెంబర్ 735, 736/ఈ వ్యవసాయ భూమి పక్కన మరో రైతు కూతురు రవీందర్ రెడ్డి అనుమతి లేకుండా వారం రోజుల క్రితం వ్యవసాయ బావి మొదలుపెట్టి ఈనెల 19న సైడ్ బోర్లు వేశారని పేర్కొన్నారు. దీంతో బాధిత మహిళ లక్ష్మీ రెవెన్యూ కార్యాలయం అధికారులకు ఫిర్యాదు చేయగా తహసీల్దార్ ఆదేశాల మేరకు ఆర్ఐ, జీపీవో వెళ్లి పరిశీలించి లారీని సీజ్ చేసి నామమాత్రపు జరిమానా విధించారని ఆరోపించారు. అయినప్పటికీ బావిలో ఉన్న సైడ్ బోర్లను తొలగించలేదని, దీంతో 3.22 ఎకరాల వరి పంట పూర్తిగా ఎండిపోయిందని బాధితులు వాపోయారు. అక్రమంగా బావిని తవ్విన లారీని సీజ్ చేయాలని, సైడ్ బోర్లను తొలగించాలని, ఎండిన వరి పంటకు నష్టపరిహారం అందించాలని వారు డిమాండ్ చేశారు. ఆందోళన చేసిన వారిలో బాధితులు బోయిని లక్ష్మి, బాబు, ప్రశాంత్, సతీష్, నీలవ్వ, మల్లవ్వ, సారవ్వ,కల్పన, మల్లిక, లక్ష్మీ, లచ్చవ్వ తదితరులున్నారు. అనంతరం తహసీల్దార్ రమేష్ కు వినతిపత్రం అందజేశారు. వీరికి దళిత సంఘ నాయకుడు సాంబారి కొమురయ్య, వంతడుపుల వెంకటస్వామి, మంద శ్రీనివాస్, బీఎస్పీ అసెంబ్లీ నియోజకవర్గ అధ్యక్షులు వేల్పుల రాజు సంఘీభావం ప్రకటించారు.

## పామ్ ఆయిల్ తోటల సాగుపై దృష్టి సారించాలి.. పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు



**జూలపల్లి :** దీర్ఘకాలికంగా ఆదాయాన్నిచ్చే పామాయిల్ తోటల పెంపకంపై రైతులు దృష్టి సారించాలని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు పిలుపునిచ్చారు. పెద్దపల్లి జిల్లా జూలపల్లి మండలం చీమలపేట, నాగులపల్లి, పెద్దాపూర్, తేలుకుంట, జూలపల్లి, కోనరావుపేట గ్రామాల్లో శనివారం మక్క, ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు పంటల మార్పిడికి శ్రీకారం చుట్టి అధిక దిగుబడులు సాధించాలని పేర్కొన్నారు. రసాయనిక ఎరువుల వాడకం తగ్గించి సేంద్రియ ఎరువులు వినియోగించాలని సూచించారు. కాగా మండల కేంద్రంలో లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి చెక్కులు పంపిణీ చేశారు.

# శ్రీనివాస మంగాపురం నుంచి ఫస్ట్ సింగిల్.. 'అలేల్లే అలేల్లే' డేట్ లాక్!

టాలీవుడ్ యువ దర్శకుడు అజయ్ భూపతి దర్శకత్వంలో తెరకెక్కుతున్న లేటెస్ట్ మూవీ 'శ్రీనివాస మంగాపురం' ఈ సినిమాతో సూపర్ స్టార్ మహేష్ బాబు మేనల్లుడు జయకృష్ణ ఘట్టమనేని హీరోగా పరిచయమవుతుండగా, రవీనా టాండన్ కూతురు రాషా థడాని హీరోయిన్‌గా టాలీవుడ్ ఎంట్రీ ఇస్తోంది. ఇప్పటికే మూవీ నుంచి టీజర్‌ను విడుదల చేయగా.. ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది. అయితే తాజాగా మూవీ నుంచి ఫస్ట్ సింగిల్ అప్‌డేట్‌ను పంచుకున్నారు మేకర్స్. ఈ సినిమాకు సంబంధించిన మొదటి సాంగ్ "అలేల్లే అలేల్లే" ఏప్రిల్ 29న విడుదల చేయబోతున్నట్లు తెలిపారు. ఈ పాటకు శ్రీమణి సాహిత్యం అందించగా జి.వి. ప్రకాష్ కుమార్ ర హరిప్రియ కలిసి పాడరు. జి.వి. ప్రకాష్ కుమార్ సంగీతం అందించాడు. జయకృష్ణ ఘట్టమనేని, రాషా థడానితో పాటు, కలెక్షన్ కింగ్ మోహన్ బాబు ఈ చిత్రంలో కీలక పాత్రలో నటిస్తున్నాడు. '=శ 100', 'మంగళవారం' వంటి వైవిధ్యమైన చిత్రాల తర్వాత అజయ్ దర్శకత్వంలో ఈ సినిమా రాబోతుండటంతో భారీ అంచనాలు నెలకొన్నాయి. చందమామ కథలు పిక్చర్స్ బ్యానర్‌పై జెమిని కిరణ్ నిర్మిస్తుండగా, ప్రముఖ నిర్మాత అశ్వినీ దత్ సమర్పిస్తున్నారు. ఇది ఒక ఇంటెన్స్ లవ్ డ్రామాగా రూపొందుతోంది.







# 2026 సమ్మర్‌కి దూరంగా స్టార్ హీరోలు...

## మిడ్ రేంజ్ సినిమాలకి గోల్డెన్ ఛాన్స్

టాలీవుడ్‌లో సమ్మర్ సీజన్ అంటే సాధారణంగా స్టార్ హీరోల భారీ సినిమాలు, బాక్సాఫీస్ రికార్డుల సందడి గుర్తుకు వస్తాయి. అయితే 2026 మే నెల మాత్రం పూర్తి భిన్నంగా ఉండనుంది. ఈసారి పెద్ద స్టార్ల సినిమాలు లేకపోవడంతో థియేటర్లలో ఒక రకమైన 'స్టార్ వాక్యూమ్' కనిపిస్తోంది. కానీ ఇదే పరిస్థితి చిన్న, మిడ్‌రేంజ్ సినిమాలకు గోల్డెన్ ఛాన్స్‌గా మారింది. సమ్మర్ హాలిడే సీజన్ కావడంతో ఫ్యామిలీ ఆడియన్స్ థియేటర్లకు వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. ఈ నేపథ్యంలో భారీ ఓపెనింగ్స్ కోసం స్టార్ పవర్ లేకపోయినా, ఒకసారి పాజిటివ్ టాక్ వస్తే కలెక్షన్స్‌ను నిలబెట్టుకునే అవకాశం ఈ సినిమాలకు ఉంది. అందుకే ఈసారి సక్సెస్ పూర్తిగా కంటెంట్ చేతుల్లోనే ఉందనే అభిప్రాయం బలపడుతోంది. గతంలో స్టార్ ఇమేజ్ ఒక సినిమాను కనీసం మొదటి వీకెండ్ వరకైనా లాగేది. కానీ ఇప్పుడు పరిస్థితి మారిపోయింది. సోషల్ మీడియా, రివ్యూల ప్రభావంతో వర్డ్ ఆఫ్ మౌత్ కీలకంగా మారింది. మంచి కథ, బలమైన భావోద్వేగాలు, ఎంగేజింగ్ స్క్రీన్‌ప్లే ఉంటే స్టార్ లేకపోయినా ప్రేక్షకులను థియేటర్లకు రప్పించవచ్చని ఇటీవల వచ్చిన పలు సినిమాలు నిరూపించాయి. ఈ మేలో రిలీజ్ అవుతున్న సినిమాలు కూడా అదే ట్రెండ్‌ను ఫాలో అవుతున్నాయి. ఈ సీజన్‌ను మరింత ఆసక్తికరంగా మార్చుతున్న అంశం 'కంబ్యాక్ స్టోరీస్'. సమంత రూత్ ప్రభు చాలా గ్యాప్ తర్వాత 'మా ఇంటి బంగారం' సినిమాతో ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. ఇది ఆమెకు సాధారణ రిలీజ్ కాదు.. ఒక రీడెఫినిషన్. నటిగా మాత్రమే కాకుండా ప్రొడ్యూసర్‌గా కూడా అడుగు పెడుతున్న సమంతకు ఇది ఒక భారీ ఛాలెంజ్. ఫ్యామిలీ ఎమోషన్స్‌తో కూడిన ఈ కథ ప్రేక్షకులను ఆకట్టుకుంటే, ఆమె కెరీర్‌లో కీలక మలుపు తిరిగే అవకాశం ఉంది. మరోవైపు నిఖిల్ సిద్ధార్థ్ పరిస్థితి కూడా కీలక దశలోనే ఉంది. 'కార్తికేయ 2' తర్వాత వచ్చిన ఫ్లాప్స్ అతని మార్కెట్‌పై ప్రభావం చూపించాయి. ఇప్పుడు 'స్వయంభు' వంటి భారీ పీరియాడిక్ ప్రాజెక్ట్‌తో వస్తున్న నిఖిల్‌కు ఇది డూ ఆర్ డై పరిస్థితి. భారీ బడ్జెట్, విభిన్న కథాంశం ఈ సినిమాను సక్సెస్ చేస్తే అతని కెరీర్ మరో స్థాయికి చేరుకోగలదు. లేకపోతే మరింత ఒత్తిడి ఎదుర్కోవాల్సి ఉంటుంది. ఇక దర్శకుడు తరుణ్ భాస్కర్ విషయానికి వస్తే, డైరెక్టర్‌గా మంచి గుర్తింపు తెచ్చుకున్న ఆయన యాక్టర్‌గా మాత్రం ఇంకా తన స్థానం కోసం పోరాడుతున్నారు. 'గాయపడ్డ సింహం' సినిమాతో మరోసారి తన అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. ఈ చిత్రం అతనికి నటుడిగా సర్వైవల్ టెస్ట్‌గా మారింది. మొత్తానికి, టాలీవుడ్ సమ్మర్ 2026 ఒక కీలక పరీక్షగా నిలుస్తోంది. స్టార్ పవర్ లేకపోయినా కంటెంట్ బలంగా ఉంటే సినిమాలు ఎలా నిలబడతాయో, అలాగే ముఖ్య నటుల కెరీర్లు ఎలా మలుపుతీసుకుంటాయో ఈ సీజన్ నిర్ణయించనుంది.

# మెక్సికో వీధుల్లో 'వారణాసి'..

## రాజమౌళి-మహేశ్ సినిమాపై గ్లోబల్ రేంజ్ రెస్పాన్స్!




భారతీయ సినిమా ఖ్యాతిని ప్రపంచానికి చాటిచెప్పిన దర్శక ధీరుడు ఎస్.ఎస్. రాజమౌళి, సూపర్ స్టార్ మహేశ్ బాబు కలయికలో రూపుదిద్దుకుంటున్న భారీ బడ్జెట్ చిత్రం 'వారణాసి'. ఈ చిత్రం తాజాగా మెక్సికో సిటీలో జరుగుతున్న అతిపెద్ద పాప్ కల్చర్ ఫెస్టివల్ 'జజశూ వీశ 2026 కామిక్ కాన్‌లో సందడి చేసింది. ఈ ప్రతిష్టాత్మక ఈవెంట్‌లో ప్రదర్శించిన ఫస్ట్ గ్లింప్స్ చూసి అంతర్జాతీయ ప్రేక్షకులు ఫిదా అయ్యారు. ఇక ఈ వేడుకకు రాజమౌళి స్వయంగా హాజరు కాలేకపోయినప్పటికీ, ఆయన పంపిన ప్రత్యేక వీడియో సందేశం ఇప్పుడు ఇంటర్నెట్‌ను ఊపేస్తోంది. మెక్సికో అభిమానులందరికీ నమస్కారం! 'వారణాసి' కేవలం ఒక సినిమా మాత్రమే కాదు.. అదొక అద్భుతమైన సాహసయాత్ర. భారతీయ పురాణ గాథలను (మైథాలజీ), ప్రపంచస్థాయి యాక్షన్‌తో మేళవించి ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నాం అని రాజమౌళి పేర్కొన్నారు. ముఖ్యంగా ఈ సినిమాలో మహేశ్ బాబును రాజమౌళి చూపిస్తున్న విధానంపై భారీ అంచనాలు నెలకొన్నాయి. ప్రపంచ ప్రేక్షకులు మునుపెన్నడూ చూడని ఒక కొత్త మహేశ్‌ను ఈ సినిమాలో చూస్తారు అని జక్కన్న భరోసా ఇవ్వడం గమనార్హం. గ్లింప్స్‌లో మహేశ్ బాబు పొడవాటి జుట్టు, రఫ్ గడ్డంతో చాలా కరుకుగా కనిపించారు. మైనస్ డిగ్రీల ఉష్ణోగ్రతలో షూట్ చేసిన యాక్షన్ సీక్వెన్స్ హాలీవుడ్ స్థాయిని మించి ఉన్నాయని అక్కడి ప్రేక్షకులు ప్రశంసిస్తున్నారు. కాగా ప్రస్తుతం ఇందుకు సంబంధించిన వీడియో వైరల్‌గా మారింది.



# ప్రియాంక చోప్రాకు అరుదైన గౌరవం

హీరోయిన్ ప్రియాంక చోప్రాకు అరుదైన గౌరవం లభించింది. ఆమెను 'గ్లోబల్ వాన్ గార్డ్' పురస్కారం వరించింది. ఆసియా పసిఫిక్ కమ్యూనిటీకి చెందిన అత్యంత ప్రభావవంతమైన వ్యక్తులను 'గోల్డ్ హౌస్' సంస్థ 'గోల్డ్ గాలా' ఈవెంట్‌లో సత్కరిస్తుంటుంది. 'గోల్డ్ గాలా -- 2026' ఐదో వార్షికోత్సవం ఈ ఏడాది మే 9న లాస్ ఏంజిల్స్‌లోని మ్యూజిక్ సెంటర్‌లో జరగనుంది. ఈ వేడుకలోనే ప్రియాంక చోప్రా గ్లోబల్ వాన్ గార్డ్ సత్కారం అందుకోనున్నారు. సినిమా పరిశ్రమలో పాతిక సంవత్సరాల కెరీర్, ఏషియన్ పసిఫిక్ అండ్ వెస్టన్ ఇండస్ట్రీల మధ్య వారధిగా ఉండటం వంటి అంశాల నేపథ్యంలో ప్రియాంకను ఈ అవార్డుకి ఎంపిక చేశారు. ప్రియాంకతో పాటు అమెరికన్ నటుడు చార్లెస్ మైఖేల్ మెల్టన్, సౌత్ కొరియన్ సింగర్ కిమ్ యూన్ జే వంటి వారు ఈ వేడుకలో పురస్కారాలను అందుకోనున్నారు. 'ఏ న్యూ గోల్డ్ వరల్డ్' థీమ్‌తో జరగనున్న 'గోల్డ్ గాలా -- 2026' ఈవెంట్‌లో సినీ ఇండస్ట్రీతో? పాటు వ్యాపారం, ఫ్యాషన్, స్పోర్ట్స్ వంటి ఇతర రంగాల్లో ప్రతిభ చూపిన వారికి కూడా అవార్డులను ప్రదానం చేస్తారు. వివిధ రంగాలకు చెందిన 650 మంది ప్రముఖుల సమక్షంలో 'గోల్డ్ 100' జాబితాలో ఉన్న వారికి అవార్డులు ప్రదానం చేస్తారు.

Printed Published Edited and Owned by Chegonda Ravikumar Yadav.Printed at Sri Laxmi Printing Press H.NO.4_6_157 Peddapalli Pin co.505172 State Telangana
TITLE CODE:TELTEL02040 EDITOR: Chegonda Ravikumar Yadav Contact Number.8008817828. Email.agnidharanews@gmail.com http://www.agnidharanews.com